15-08-2025, శుక్రవారం
TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక
సంపుటి: 10 | సంచిక:79 | వెల:05
JANAM POWER









# వణుకుతున్న రాష్ట్రం

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

భారీ వర్షాలతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టణ, నగర ప్రాంతాల్లో సామాన్యులకు ఇబ్బందులు



**జనం పవర్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు నెలలో కురుస్తున్న భారీ వర్షాలు ఒకవైపు రైతులకు ఆశాకిరణంగా మారుతుండగా, మరోవైపు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వరదలు, ముంపు సమస్యలతో విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాల్లో వర్షాలు ప్రమాదకరంగా మారి, ఇండ్లు, రోడ్లు, వ్యవసాయ భూములు నీట మునిగాయి. గత 48 గంటల్లో కురిసిన భారీ వర్షాలతో పలు జిల్లాల్లో రవాణా వ్యవస్థ స్థంభించి, గ్రామాలు ఒంటరిగా మారాయి. ఈ వర్షాల ప్రభావాన్ని అన్ని కోణాల్లో విశ్లేషిస్తే, ఇవి వ్యవసాయానికి మేలు చేస్తున్నప్పటికీ, అధిక

..మిగతా 2లో

## భారత్ పెట్రోలియం డీలర్ల కష్టాలు చూడతరమా



3

## ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సోదాలు

సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల తనిఖీలు

పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు ఫ్రీజ్

ఏడాదిలో రూ.3 వేల కోట్లు కాజేసినట్లు ఈడీ వెల్లడి

హవాలా రూపంలో డబ్బును యూకేకి పంపి క్రిప్టో గా మార్పు

3

## వికారాబాద్‌లో స్వల్ప భూకంపం

2

పరిగి మండలంలో కంపించిన భూమి

ఉదయం 4 గంటల ప్రాంతంలో భూకంపం

జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు

ప్రజలంతా భద్రతా సూచనలు

పాటించండి : అధికార యంత్రాంగం





# బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్న ఈసీ



### ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సంచలన ఆరోపణలు

**జనం పవర్, హైదరాబాద్:**

బీహార్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. పాట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రత్యర్థులను బెదిరించేందుకు సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను వాడిన బీజేపీ, ఇప్పుడు రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్నీ తన ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని ఆరోపించారు.తేజస్వీ యాదవ్ ప్రకారం, ఈసీ చాలామంది ఓటర్లకు ఒకటి కంటే ఎక్కువ ఓటర్ ఐడీలు అందిస్తోంది. గతేడాది విజయ్ కుమార్ సిన్హా వ్యవహారం, తాజాగా ముజఫర్‌పూర్ మేయర్ నిర్మలా దేవీ కేసు దీనికి ఉదాహరణలని తెలిపారు. నిర్మలా దేవీ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నిలిచినా ఆశ్చర్యం లేదన్నారు.ఇంతటి వివాదం మధ్య ఈసీ మీడియా ముందుకు రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ప్రధానమంత్రి మీడియాతో మాట్లాడరు, బీహార్ ముఖ్యమంత్రి కూడా అలాగే ఉంటారు. ఇప్పుడు ఈసీ కూడా వారిని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యం తీవ్రమైన ప్రమాదంలో ఉందని తేజస్వీ హెచ్చరించారు.ఆగస్టు 17న రోహ్తాస్ జిల్లాలో ప్రారంభమయ్యే 'ఓటర్ల హక్కు యాత్ర'లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి పాల్గొననున్నట్లు తెలిపారు. గుజరాత్ నుంచి వచ్చిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిఖూభాయ్ దల్సానియా బీహార్‌లో ఓటరుగా నమోదు కావడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

# వికారాబాద్‌లో స్వల్ప భూకంపం



**పరిగి మండలంలో కంపించిన భూమి**

**ఉదయం 4 గంటల ప్రాంతంలో భూకంపం**

**జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు**

**ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదు**

**భద్రతా సూచనలు పాటించండి : అధికార యంత్రాంగం**

**జనం పవర్, హైదరాబాద్:**

వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలం గురువారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. ఉదయం సుమారు 4 గంటల ప్రాంతంలో బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నామత్ నగర్, హనుమాన్ గండి ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. గ్రామస్తుల వివరాల ప్రకారం, కొన్ని సెకన్లపాటు భూమి కంపించడంతో ఇళ్లలో ఉంచిన సామాన్లు కిందపడిపోయాయి. ఆకస్మిక ప్రకంపనలతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఒకవైపు నిరంతర వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు భూకంపం సంభవించడం స్థానికులను మరింత భయపెట్టింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమాచారాన్ని సేకరిస్తూ, ప్రకంపనల తీవ్రత, కేంద్రబిందువు వివరాలను అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భూకంపాల సమయంలో భద్రతా సూచనలు పాటించాలని అధికార యంత్రాంగం సూచించింది.

# శ్రీశైలానికి వరద ప్రవాహం



**7 గేట్లు ఎత్తి నీళ్లు విడుదల**

**జనం పవర్, హైదరాబాద్:**

భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవహం వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు ఏడు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి స్పిల్ వే ద్వారా 1,87,208 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 65,632 క్యూసెక్కులను అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి 1,17,221 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటల సమయానికి 882.10 అడుగులు, నీటి నిల్వ 199.2737 టీఎంసీలుగా నమోదైంది.



# వణుకుతున్న రాష్ట్రం

మొదటి పేజీ తరువాయి

వర్షపాతం కారణంగా సంభవిస్తున్న నష్టాలు రైతులు, సామాన్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇండియన్ మెటియరాలజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) హెచ్చరికల ప్రకారం, మరిన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**పెరిగిన నీటి లభ్యత**

ఈ ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గత జూన్‌జూలైలో ఎండలు మండిపోయిన తర్వాత, ఇప్పుడు కురుస్తున్న వర్షాలు జలాశయాలు, చెరువులు, కుంటలు నిండుకుండలు కావడంతో వ్యవసాయానికి అనుకూలంగా మారాయి. ముఖ్యంగా ఖరీఫ్ పంటలైన పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వరి వంటివి మెరుగైన దిగుబడి ఇవ్వనున్నాయి. వరంగల్ జిల్లాలోని రైతులు ఈ వర్షాలు తమ పంటలకు అవసరమైన తేమను అందించాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. బే ఆఫ్ బెంగాల్‌లో ఏర్పడిన లో ప్రెషర్ ఏరియా ప్రభావంతో ఈ వర్షాలు మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణ స్థాయికి మించి వర్షపాతం నమోదైంది, ఇది భవిష్యత్తులో నీటి కొరతను తగ్గిస్తుంది. హైదరాబాద్ సహా 8 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది, ఇది వ్యవసాయానికి సానుకూలం. అయితే, ఈ మేలు అన్ని ప్రాంతాల్లో ఒకేలా లేదు; కొన్ని జిల్లాల్లో అధిక వర్షం పంటలను దెబ్బతీస్తోంది.

**వరదలు, ముంపు సమస్యలతో నష్టాలు**

మరోవైపు, భారీ వర్షాలు పట్టణాలు, గ్రామాల్లో విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. వరంగల్ జిల్లాలో ఆగస్టు 12న కురిసిన భారీ వర్షాలతో లోతట్టు



ప్రాంతాలు మునిగిపోయాయి, రోడ్లు నీట మునిగి రవాణా స్థంభించింది. హనుమకొండ, కాజీపేటలో వరదలు సంభవించి, ఇండ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచిర్యాల్, కుమ్రం భీమ్ అసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలు రోడ్లు, వ్యవసాయ భూములను ముంచెత్తాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తిలో భారీ వర్షాల హెచ్చరికలు జారీ అయ్యాయి, వాగులు పొంగి పొర్లుతున్నాయి. హైదరాబాద్‌లోనూ రాజేంద్రనగర్‌లో 52.3 మి.మీ వర్షపాతం నమోదై, వాటర్‌లాగింగ్ సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో వ్యవసాయ భూములు మునిగి, పంటలు దెబ్బతిన్నాయి; ముఖ్యంగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పంటలను నాశనం చేశాయి. గత సంవత్సరాల్లోనూ ఇలాంటి వరదలు రైతులను నష్టాల్లోకి నెట్టాయి.

**అధిక వర్షం పంటలపై ప్రభావం**

వర్షాలు మేలు చేస్తున్నప్పటికీ, అధిక వర్షపాతం కారణంగా రైతులు నష్టపోతున్నారు. వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వరదలు వ్యవసాయ భూములను ముంచెత్తి, పంటలు సర్వనాశనమయ్యాయి. కరీంనగర్, సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పంటల రూట్ సిస్టమ్‌ను దెబ్బతీశాయి. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి జిల్లాలో 151 మి.మీ వర్షపాతం నమోదై, పంటలు దెబ్బతిన్నాయి. వాతావరణ మార్పుల ప్ర[illegible]లాంటి అనిశ్చిత వర్షాలు పెరుగుతున్నాయి, ఇది రైతులకు ఆర్థిక నష్టాలను తెచ్చిపెడుతోంది. సాధారణంగా, ఈ వర్షాలు మట్టి తేమను పెంచినప్పటికీ, అధిక వర్షం నల్లరేగడి నేలల్లో పంటలు పెరగకుండా చేస్తుంది.

**సహాయక చర్యలు మొదలుపెట్టిన ప్రభుత్వం**

రాష్ట్ర ప్రభుత్వం వర్షాల ప్రభావాన్ని ఎదుర్కోవడానికి చర్యలు చేపట్టింది. వరంగల్‌లో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్ఎఫ్) బృందాలు మోహరించబడ్డాయి, ప్రజలను సహాయక శిబిరాలకు తరలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు హై అలర్ట్ జారీ చేసి, నష్టాల అంచనా వేయాలని సూచించారు. ఐఎండీ మరిన్ని జిల్లాల్లో భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. అయితే, దీర్ఘకాలికంగా వరద నివారణ చర్యలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది, ఎందుకంటే LPA ప్రభావంతో మరో 56 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**ముందస్తు చర్యల అవసరం**

ఈ భారీ వర్షాలు తెలంగాణకు మిశ్రమ ఫలితాలను తెచ్చిపెట్టాయి. రైతులకు నీటి లభ్యత పెరిగినప్పటికీ, వరదలు, ముంపు సమస్యలు నష్టాలను కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇలాంటి భారీ వర్షాలు పెరుగుతున్నాయి, కాబట్టి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, రైతులకు బీమా సదుపాయాలు అందించాలి. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.




# ఆధారాలివ్వండి

మొదటి పేజీ తరువాయి

పదాలు' ప్రచారం చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది. ''ఒక వ్యక్తిఒకే ఓటు'కు సంబంధించిన నిబంధన తొలి ఎన్నికలు జరిగిన 195152 నాటి నుంచి అమల్లో ఉంది. ఏ ఎన్నికల్లోనైనా ఎవరైనా రెండుసార్లు ఓటు వేసినట్లు ఆధారాలు ఉంటే లిఖితపూర్వక అఫిడవిట్ ఎన్నికల సంఘానికి ఇవ్వండి. ఎటువంటి ఆధారాలు లేకుండా దేశంలోని ఓటర్లందర్నీ 'చోర్'గా పిలవడం సరికాదు'' అని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటువంటి చెడు పదబంధాలు ప్రచారం చేయడం కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిపై దాడిగా అభివర్ణించింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్లు చోరీకి గురయ్యాయని ఇటీవల ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఈ అసెంబ్లీ స్థానంలో ఓడిపోవడం వల్లే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అక్కడ ఓటమి పాలయ్యారని అన్నారు. వీటిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఓటరు జాబితాల్లో తప్పిదాలకు సంబంధించి వివిధ అంశాలను లేవనెత్తుతూ ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేత విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు.

# తెలంగాణలో అతి భారీ వర్షాలు

**పలు జిల్లాలకు రెడ్ అలర్ట్**

**జనం పవర్, హైదరాబాద్:**

నేడు తెలంగాణలో పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయ్యింది. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ముందస్తు చర్యలు చేపట్టాలి



మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి, వాతావరణ సూచనల మేరకు వరదల సమయంలో ఆస్తి, ప్రాణనష్టం నివారించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వంగా ఇప్పటికే కోట్లు విడుదలచేసి, అవసరమైతే మరిన్ని నిధులు అందించబడతాయని, నష్టపోయిన ప్రజలకు పరిహారం కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే, పోలీసు యంత్రాంగం సహకారంతో వరద సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. సిఎస్ కే. రామకృష్ణా రావు తెలిపారు, తూర్పు, దక్షిణ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ అయి, మిగిలిన ప్రాంతాల్లో కూడా భారీ వర్షాల అవకాశముందని, అధికారులు అప్రమత్తంగా ఉండి, జిల్లా డిజాస్టర్ నిధులను వినియోగించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, చెరువుల సమీపంలోని రోడ్లు, కల్వర్టులు, వంతెనలను మూసివేయడం, పట్టణ కాలనీల్లో నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకోవడం, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టడం, ప్రజలు అవసరమైతే మాత్రమే బయటకు రావడం, సాగు విస్తీర్ణానికి యూరియా నిల్వలు అందించడం వంటి సూచనలు ఈ సమావేశంలో ఇచ్చారు.

# పాకిస్థాన్ స్వాతంత్ర్య వేడుకల్లో విషాదం



## గన్‌ఫైర్‌తో ముగ్గురు మృతి, 64 మందికి గాయాలు

**జనం పవర్, హైదరాబాద్:**

పాకిస్థాన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విషాద ఘటన చోటుచేసుకుంది. కరాచీ నగరంలోని అనేక ప్రాంతాల్లో వేడుకల పేరుతో జరిగిన గన్‌ఫైర్ ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా, 64 మంది గాయపడ్డారు. మృతుల్లో ఎనిమిదేళ్ల చిన్నారి, ఓ వృద్ధుడు ఉన్నారు. గాయపడిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా పాకిస్థాన్‌లో జాతీయ పండుగలు, వివాహాలు, క్రీడా విజయాలు వంటి సందర్భాల్లో గాల్లోకి తుపాకీ కాల్పులు జరిపే 'సెలబ్రేటరీ ఫైరింగ్' విస్తృతంగా జరుగుతుంటుంది. కానీ ఈ నిర్లక్ష్య వేడుకలు తరచూ ప్రాణ నష్టాలకు దారితీస్తున్నాయి. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 95 మందికి గాయాలు కాగా, అంతకుముందు సంవత్సరం 80 మంది గాయపడ్డారు. తాజా ఘటనలో లియాఖతాబాద్, కోరంగి, మెహబూబాబాద్, అఖ్తర్ కాలనీ, బాల్దియా, ఓరంగీ టౌన్ వంటి ప్రాంతాల్లో గన్‌ఫైర్ జరిగింది. అజీజాబాద్‌లో తూటా తగిలి ఎనిమిదేళ్ల బాలిక చనిపోయింది. కోరంగి ప్రాంతంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనలపై స్థానిక పోలీసులు ఇప్పటి వరకు 20 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఆధునిక తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఈ రకమైన చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# సవాల్ విసిరితే ఖాళీగా కూర్చోము



## పాక్ హెచ్చరికలపై ఓవైసీ ఫైర్

**జనం పవర్, హైదరాబాద్:**

ఇస్లామాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యూత్ డే కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. సింధూ జలాల విషయంలో భారత్‌కు ఒక్క చుక్క నీటినీ ఇవ్వబోమని, నదీ జలాలను నిలిపివేస్తే దానిని యుద్ధానికి కవ్వింపుగా పరిగణిస్తామని షరీఫ్ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. "ఇలాంటి అర్థంలేని మాటలు మానుకోవాలి. మీరు సవాలు విసిరితే మేము ఖాళీగా కూర్చోము. మా వద్ద బ్రహ్మోస్ ఉన్నాయి" అని ఆయన స్పష్టం చేశారు. భారత్ విషయంలో ఇలాంటి బెదిరింపులు ఏ మాత్రం పనిచేయవని ఆయన హెచ్చరించారు. గతంలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన అణ్వాయుధ హెచ్చరికలను కూడా ఒవైసీ తిరస్కరించారు. భారత్‌పై ఉపయోగించిన పదజాలం గర్హనీయమని, అమెరికా వేదిక నుంచి ఇలాంటి మాటలు మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. "ఇక చాలు... అయ్యిందేదో అయిపోయింది" అంటూ పాక్ నాయకత్వానికి ఆయన కఠిన సందేశం ఇచ్చారు.

# ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సోదాలు



## సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల తనిఖీలు

## పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు ఫ్రీజ్

## ఏడాదిలో రూ.3 వేల కోట్లు కాజేసినట్లు ఈడీ వెల్లడి

### హవాలా రూపంలో డబ్బును యూకేకి పంపి క్రిప్టో కరెన్సీగా మార్పు

**జనం పవర్, హైదరాబాద్:**

ల్లీగల్ బెట్టింగ్ యాప్ పరిమ్యాచ్ కేసులో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు ముంబయి, సూరత్, దిల్లీ, నోయిడా, జైపుర్, మధురై, కాన్పుర్‌లలోను సోదాలు జరిగాయి. ఈసందర్భంగా పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు ఈడీ అధికారులు తెలియజేశారు. డిజిటల్ డాక్యుమెంట్లు, మ్యూల్ ఖాతాల డెబిట్, క్రెడిట్ కార్డులు, డిజిటల్ పరికరాలను సైతం స్వాధీనం చేసుకొన్నామన్నారు. ముంబయి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో పరిమ్యాచ్ డాట్ కామ్ పై నమోదైన కేసు ఆధారంగా మరో కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు పెట్టుబడి పెట్టిన వారి నుంచి ఏడాదిలో రూ.3 వేల కోట్లు కాజేసినట్లు ఈడీ పేర్కొంది. మ్యూల్ ఖాతాల్లో నగదు ఉంచి తమిళనాడు మధురైలలో భారీగా నగదు విత్ డ్రా చేసినట్లు గుర్తించింది. హవాలా రూపంలో డబ్బును యూకేకి పంపి అక్కడ క్రిప్టో కరెన్సీగా మార్చినట్లు గుర్తించామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

# అందుకే భారత్ పై ట్రంప్ అక్కసు

## భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్

**జనం పవర్, హైదరాబాద్:**



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ టారిఫ్‌లపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూదిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు.
ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. బ్రిక్స్ కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని న్యూదిల్లీ వాదిస్తోంది. దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ఆయన ప్రమేయాన్ని గుర్తించడంతో పాటు.. నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది' అని స్వరూప్ అన్నారు. ఈ సందర్భంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని ఆయన ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనన్నారు.
రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూదిల్లీ చర్చలు జరుపుతోంది.



# హైదరాబాద్ బేగంబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

**జనం పవర్, హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో

# టీడీపీ ఘన విజయం

**జనం పవర్, హైదరాబాద్:**




వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కంచుకోటకు బీటలు వారాయి. పులివెందుల బైపోల్ జగన్ నాయకత్వానికి గొడ్డలిపెట్టు అయింది. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ విజయ బావుటా ఎగురవేసింది. టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,735 ఓట్లతో ఘన విజయం సాధించారు. 6,050 ఓట్ల మెజారిటీతో లతారెడ్డి గెలిచారు. లతారెడ్డి గెలుపుతో పులివెందులలో వైసీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైసీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి కేవలం 685 ఓట్లు మాత్రమే సాధించారు. లతారెడ్డి గెలుపుతో పసుపు సైనికులు సంబురాలు చేసుకుంటున్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి లతారెడ్డిని ఆశీర్వదిస్తున్నారు. లతారెడ్డి గెలుపుతో పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
మరోవైపు.. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక కౌంటింగ్ కొనసాగుతోంది. టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి ఆధిక్యంలో ఉన్నారు. కడప పాలిటెక్నిక్ కాలేజ్‌లో కౌంటింగ్ కొనసాగుతోంది. రెండు రౌండ్లలో ఒంటిమిట్ట జెడ్పీటీసీ కౌంటింగ్ ప్రక్రియ పూర్తికానుంది. పులివెందుల, ఒంటిమిట్ట బరిలో 11 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. పులివెందులలో 74శాతం, ఒంటిమిట్టలో 86 శాతం ఓటింగ్ నమోదైంది. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి ఆధిక్యంలో ఉన్నారు.
కడప పాలిటెక్నిక్ కళాశాలలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. ఒకే రౌండ్‌లో పులివెందుల జెడ్పీటీసీ కౌంటింగ్ పూర్తి అయింది. పులివెందుల జెడ్పీటీసీ కౌంటింగ్‌కు పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఒంటిమిట్ట జెడ్పీటీసీ కౌంటింగ్‌కు పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో ఒంటిమిట్ట జెడ్పీటీసీ కౌంటింగ్ పూర్తిఅయింది. ఒక్కో టేబుల్‌పై 1,000 ఓట్లు లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. అయితే, ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని ఆరోపిస్తూ కౌంటింగ్‌ను వైసీపీ నేతలు బహిష్కరించిన విషయం తెలిసిందే.

# భారత్ పెట్రోలియం డీలర్ల కష్టాలు చూడతరమా?

### డీడీలు చెల్లించినా సరిపడా పెట్రోల్ ట్యాంకర్లను పంపించకుండా వేధింపులు

### ఆయిల్ టార్గెట్లు పూర్తి చేయలేదంటూ కొర్రీలు

### భారత్ పెట్రోలియం కంపెనీ కరీంనగర్ ఎస్ఓ వికృత చేష్టలు

### వెంటనే ఉన్నతాధికారలు చర్యలు తీసుకోవాలంటున్న డీలర్లు

**జనం పవర్:కరీంనగర్:**




దేశంలోనే ప్రసిద్ధి చెందిన ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కంపెనీకి కొందరు అధికారుల మూర్ఖపు చేష్టల మూలంగా అపప్రథ వస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.కరీంనగర్ జిల్లా భారత్ పెట్రోలియం కంపెనీ సేల్స్ ఆఫీసర్(ఎస్ఓ) డీలర్లను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో మొత్తం కంపెనీకే జిల్లాలో చెడ్డ పేరు వస్తోందని పలువురు డీలర్లు వాపోతున్నారు.పెట్రోల్ ట్యాంకర్ల కోసం సకాలంలో డీడీలు కట్టినా వివిధ కారణాలు చూపెడుతూ ఆయిల్ ట్యాంకర్లు పంపించకుండా పలువురు డీలర్లను వేధించడంతో జిల్లాలో ఉన్న పలువురు డీలర్లు నానా అగచాట్లు పడుతున్నారు.ఆయిల్ టార్గెట్లు అందుకోలేదంటూ కంపెనీ నిబంధలకన్నా తన స్వంత నిబంధనలను అమలు చేస్తూ డీలర్లకు పెట్రోలియం ట్యాంకర్లను నిలిపివేస్తూ వారిని ఇరుకున పెడుతున్నారని సమాచారం. ఇలా అయితే తమ పెట్రోల్ బంకుల ద్వారా వినియోగదారులకు సరైన సేవలను ఎలా అందించగల్గుతామని వారు వాపోతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో సైతం ఆయిల్ అమ్మకాల టార్గెట్ల పేరుతో డీలర్లు డీడీలు కట్టినా సరిపడా పెట్రోల్ ట్యాంకర్లను పంపించకుండా సదరు కరీంనగర్ జిల్లా భారత్ పెట్రోలియం ఎస్ఓ కొర్రీలు పెడుతూ మొత్తం డీలర్ల వ్యవస్థనే నాశనం చేయడానికి పూనుకున్నారనే ఆరోపణలు విరివిగా వస్తున్నాయి.గతంలో రెండు లేదా మూడు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఒక పెట్రోల్ బంకు ఏర్పాటుకు అనుమతి ఇచ్చేవారు.కానీ ఇప్పుడు ప్రతీ 100 మీటర్లకు ఒక పెట్రోల్ బంకు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడమే కాక గతంలో రూ.5 నుంచి 6 రూపాయల కమీషన్ డీలర్లకు ఉండేది.ఇప్పుడు ఆ కమీషన్ పూర్తిగా తగ్గి కేవలం రూ.2 నుంచి 3 రూపాయల వరకే ఉండటంతో డీలర్లు ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా గతంలో పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బందికి కంపెనీనే వేతనాలు చెల్లించేది.ఇప్పుడు సిబ్బందికి ఎలాంటి వేతనాలు చెల్లించడంలేదు.ఇలాంటి అనేక ఇబ్బందికర,ప్రతికూల పరిస్థితుల్లో పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్న డీలర్ల బాధలు వర్ణణాతీతం.అయితే కంపెనీ జిల్లా ఎస్ఓ డీలర్ల సాధక బాధకాలను అర్థం చేసుకుని వారిని ప్రోత్సహించి కంపెనీని పురోభివృద్ధి బాట పట్టించాల్సిందిపోయి అనేక కొర్రీలతో డీలర్లను వేధింపులకు గురిచేస్తూ భారత్ పెట్రోలియం కంపెనీ వినాశనానికి పూనుకున్నట్లుగా కొందరు డీలర్లు మండిపడుతున్నారు. కంపెనీకి వినియోగదారుల్లో ఉన్న విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తూ డీలర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న వైనంపై కంపెనీ ఉన్నతాధికారులు దృష్టినిలిపి కరీంనగర్ ఎస్ఓపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు డీలర్లు కోరుతున్నారు.




# కానిస్టేబుళ్లకుదూరవిద్య.. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పోలీసుశాఖ మధ్య ఒప్పందం

**జనం పవర్, హైదరాబాద్:**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీరియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సూచనలు



**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 14:**

పెద్దపల్లి జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక సూచనలు చేశారు. గురువారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డి.వేణు సహకారంతో పరిశీలించారు. కలెక్టర్ శ్రీ హర్ష తెలిపారు, ఆగస్టు 15న జరిగే వేడుకల్లో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్ సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఉదయం 9.25కి ముఖ్య అతిథి కలెక్టరేట్‌కు చేరి 9.30కి జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాల కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 9.33 నుంచి 9.45 వరకు గౌరవ వందల స్వీకారం, పరేడ్ నిర్వహించబడతాయి, అనంతరం ముఖ్య అతిథి సందేశం అందిస్తారు, తర్వాత ఉద్యోగస్తులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేయబడతాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా, సక్రమంగా జరిగేందుకు అవసరమైన సౌండ్ సిస్టం, విద్యుత్ సరఫరా, డయాస్, టెంట్లు, బ్యారికేడ్లు వంటి ఏర్పాట్లను పకడ్బందిగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 14**

జగిత్యాల పట్టణంలో 41 42 43 46 వార్డులలో 1 కోటి 30 లక్షలతో అభివృద్ధి పనులకు జగిత్యాల శాసన సభ్యులు డా సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరు చేయటం జరిగిందన్నారు. 150 కోట్లతో జగిత్యాల పట్టణంలో అభివృధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధితో పాటు పచ్చదనం పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ.. ప్రజల సహకారం తోనే పట్టణం అభివృద్ధి సాధ్యమన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలని మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం 20 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగిందని అధికారులు త్వరిత గతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అభివృద్ది పనుల విషయంలో ఆటంకం కలిగించవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నన్నారు. 40 ఇండ్లు కట్టని నాయకులు ఇతర నియోజకవర్గం నుండి ఇక్కడికి వచ్చి 4500 ఇండ్ల మౌలిక వసతులు పై మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి తడి పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. నా ఇంటి నుండే తడి పొడి చెత్త సేకరణ ప్రారంభం కావాలి..చెత్త సేకరణ వేరు చేయకుంటే చెత్త తీసుకోవద్దు అని మున్సిపల్ కార్మికులను కోరుతున్నా...ఏదో ఒక సందర్భంలో మార్పు రావాలన్నారు. డంపింగ్ యార్డు లో ప్రహరీ కి 2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి..ఇప్పటి వరకే 5 కోట్ల నిధులు చెత్త శుద్ధికి మంజూరు చేయటం జరిగిందన్నారు. పచ్చదనం పరిశుభ్రత విషయం లో జగిత్యాల ఆదర్శంగా ఉండేలా చేయాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. రాజకీయాలకు అతీతంగా పట్టణం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. పట్టణం అభివృద్ధికి ప్రజలకు సేవలకు గాను ప్రతి వార్డుకు వార్డు అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. వచ్చే ఎన్నికల కోసం కాదు వచ్చే తరం కోసం పనిచేయాలన్నారు. జగిత్యాలలో అత్యధికంగా డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. 203 కోట్లతో నూతన ఆసుపత్రి మంజూరు చేయటం జరిగిందన్నారు. ప్రజలందరూ మత సామరస్యంగా ఉండాలి...ప్రతి ఒక్కరూ వారి మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలి అన్నారు. హింస అనేది అభివృద్ధికి ఎమ్మెల్యే సంజయ్ ఆటంకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన. మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్. మన్సూర్, అబ్దుల్ ఖాదర్. ముజాహిద్,ఖాజిం అలీ, కో ఆప్షన్ హసిబొద్దిన్, మాజీ కౌన్సిలర్ లు కప్పల శ్రీకాంత్, ఫిర్దోస్ తరుణం,బాలే శంకర్, తోటమల్లికార్జున్, కూతురు పద్మ శేఖర్, కూతురు రాజేష్, బోడ్ల జగదీష్. డిష్ జగన్. పంబాల రాము, అహమ్మద్, అంగడి సాయి, ఏఓ శ్రీనివాస్. డిఈ ఆనంద్, వరుణ్, ఏఈ శరన్ అనిల్, పెద్దింటి రాజు, దుమాల రాజ్ కుమార్, ఫిరోజ్, జావేద్, జమీల్, లింగారెడ్డి, గంగాధర్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జాతి ఐక్యతకు ప్రతీకగా ర్యాలీ నిర్వహణ



**జనం పవర్, గంగాధర ఆగస్ట్ 14:**

గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో ఆగస్టు 14, 2025న ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించబడింది. గంగాధర మండల బిజెపి శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతి ఐక్యతకు ప్రతీకగా స్థానిక పాఠశాల విద్యార్థులు విపులంగా పాల్గొన్నారు. స్థానిక ఎస్సై వంశీకృష్ణ, వైద్ రామానుజన్ జిల్లా కోశాధికారి, పెరక శ్రావణ్ కుమార్ అసెంబ్లీ కన్వీనర్, దూలం కళ్యాణ్ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు, తుమ్ నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, సదాల భాస్కర్ జిల్లా కౌన్సిల్ మెంబర్, మల్యాల వినయ్ సాగర్ జిల్లా ఎస్సీ మోక్ష ప్రతినిధి, శ్రీపతి రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్, గాలిపెల్లి శ్రీనివాస్, మోతే నరసింహారెడ్డి, వోడ్నాల రాజు, గంగాధర రవి, హర్ష రాజు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్, సుంకరి అనిల్, తుమ్ కరుణాకర్, పెరుక్ మహేష్, బూత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు, వివేకానంద, సురభి, విన్నర్స్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ దేశభక్తి, జాతీయ ఐక్యత భావనను పెంపొందిస్తూ, జాతీయ పతాక వైభవాన్ని ప్రతిబింబించింది. ప్రాంతీయ సంఘాలు, విద్యా సంస్థలు, రాజకీయ నాయకత్వం కలసి ఉత్సాహభరిత వాతావరణంలో వందల మంది ప్రజలు పాల్గొని జాతీయ పతాకం పట్ల గర్వాన్ని వ్యక్తం చేశారు.



# సెల్ టవర్ పనులు నిలుపుదల చేపించండి

**ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం నిలిపివేసేలా కృషి చేయాలని**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డికి వినతి**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 14**

జగిత్యాల పట్టణంలోని 7వ వార్డులో ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్యం దెబ్బ తింటుందని, సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేసేలా కృషి చేయాలని కోరుతూ మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ట్రాయ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని జీవన్ రెడ్డి కి విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి ట్రాయ్ నిబంధనలను విరుద్ధంగా ఏర్పాటు చేసే సెల్ టవర్ నిర్మాణం నిలిపి వేసేలా అధికారులకు లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సెల్ టవర్ నిర్మాణం పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# బీద బిడ్డల చదువంటే మంత్రి శ్రీధర్ బాబు కు చులకన

**కక్ష్యతోనే డిగ్రీ కళాశాలను దూరంగా కట్టించిండ్లు**

**కేసుల్లో ఇరికించే ప్రయత్నాలకు భయపడేది లేదు**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**జనం పవర్, మంథని, ఆగస్టు 14:**



బడుగు బలహీనవర్గాల బిడ్డలు చదువకునే డిగ్రీ, జూనియర్, ప్రైమరీ, అంగన్‌వాడీ కేంద్రాలాంటి నిలయాలంటే మంత్రికి చులకనేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ అన్నారు. గురువారం మంథని మండలం మల్లెపల్లి శివారులోని ప్రభుత్వ డిగ్రీకళాశాలను ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనాడు డిగ్రీ కళాశాల మంజూరీ చేయాలని మంథనికి చెందిన కొండెల మారుతి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టితే ప్రభుత్వం మంజూరీ చేసిందన్నారు.అయితే తన తండ్రి ప్రమేయం లేకుండానే డిగ్రీ కళాశాల వచ్చిందని కక్ష్యతో మంథనికి దూరంగా మల్లెపల్లిలో నిర్మించారని ఆయన అన్నారు.ఎక్కడ ప్రసంగించినా మంథనికి జేఎన్‌టీయూ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలను తీసుకువచ్చానని మంత్రి గొప్పలు చెప్తుంటారని, జేఎన్‌టీయూ కళాశాలలో 1118మంది విద్యార్థులు ఇతర ప్రాంతాల వారు చదువుకుంటే మంథనికి చెందిన వాళ్లే కేవలం 72మంది మాత్రమే ఉన్నారన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో వంద మందిలో కేవలం 16మంది మాత్రమే మంథని వాళ్లు చదువుకోవడం విడ్డూరమన్నారు. మంత్రి తీసుకువచ్చిన కళాశాలలు ఎవరికి ఉపయోగపడుతున్నాయో ఆలోచన చేయాలన్నారు. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 360ఉంటే రానురాను 120కి చేరిందని, ఈ కళాశాలలో చదువుకునేందుకు విద్యార్థులు రాకుండా చేస్తున్నారని అన్నారు. మంత్రిగా అయిన తర్వాత ఒక్కసారి కూడా కళాశాలను సందర్శించి సమస్యలు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు తీసుకువచ్చినా పర్మినెంట్ బిల్డింగ్ , హస్టల్ వసతి లేదన్నారు. అంతేకాకుండా ఈ కళాశాలకు అనుబంధంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఫ్యాక్టరీలు, ఇండస్ట్రీలో తీసుకురావాలని ఎందుకు ఆలోచన చేయడం లేదనీ ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలకు నిలువెత్తు నిదర్శనం దుద్దిళ్ల కుటుంబమని, గంజాయి కుట్రలో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన చరిత్ర మంత్రిదేనన్నారు. చదువులను ప్రోత్సహిస్తామని గొప్పలు చెప్పే మంత్రి చదువుకునే బిడ్డలకు ఎక్కడ ప్రోత్సహం అందిస్తున్నాడోచెప్పాలన్నారు. ఎదురుతిరిగి ప్రశ్నిస్తే కేసులు పెట్టించడం తప్ప చేసిందేమి లేదని, కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు చేసినా తాను భయపడనని, తన కంఠంలో శ్వాస ఉన్నంత వరకు ప్రజల కోసం పోరాటం చేస్తానని, దుద్దిళ్ల కుటుంబం నీతి నిజాయితిని ప్రజలు ముందు ఉంచుతానని అన్నారు. సమాజాన్ని వాడుకుని మోసం చేయడం కాదని, చిత్తశుద్ధి ఉంటే డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని,తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరీ చేసిన బిల్డింగ్‌ను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే పేద విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తే డిగ్రీ కళాశాలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, అలాంటి ఆలోచన చేయాలని ఆయన హితవుపలికారు.

# మారనున్న మంథని ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు



**ఇద్దరు నూతన డాక్టర్ల నియామకం**

**ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల కోసం 20 లక్షల నిధులు కేటాయించిన మంత్రి**

**జనం పవర్, మంథని, ఆగస్టు 14 :**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాసనసభ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నిధులు మంజూరు చేయడం జరిగిందనీ మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరతతో రోగులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి ఇద్దరు నూతన డాక్టర్ నియమించడం జరిగిందని జిల్లా మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రోగుల సౌకర్యార్థం 5 లక్షల రూపాయలతో సామాజిక ఆసుపత్రి నందు వెయిటింగ్ హాల్ నిర్మాణం చేయడం జరిగిందని మత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల కోసం కొత్తగా రూ. 12 లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, పుట్టిన పసిపాపల కోసం 1.12 లక్షలతో వార్నర్, ఫోటోతెరపి మరియు సామాజిక,మత శిశు ఆసుపత్రి నందు రోగుల సౌకర్యం 1.80 లక్షలతో ఆర్ ఓ ప్లాంట్ల ఏర్పాటు చేసి త్వరలో మంత్రి శ్రీధర్ బాబు గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మందులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకంతో వస్తున్న రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రథమ లక్ష్యమని జిల్లా మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

# గ్రామీణాభివృద్ధి సమీక్షలో కీలక నిర్ణయాలు

**స్వశక్తి సంఘాల రుణ చెల్లింపులు పూర్తిచేయాలి**

**ఇందిరమ్మ ఇండ్లకు అదనంగా లక్ష రూపాయల రుణం**

**విదేశీ ఉపాధిపై ఆగస్టు 26న అవగాహన సదస్సు**

**సినిమా, నిర్మాణ రంగ కోర్సులతో యువతకు ఉపాధి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 14:**



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పనితీరు, లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ రుణాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం శాతం వంద మంజూరు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత అధికారులు, శాఖాధిపతులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, సెర్ప్ కార్యక్రమం కింద స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్ రుణ లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని, స్వశక్తి మహిళా సంఘాలు పొందిన రుణాలు ఎన్‌పీఏ గా మారకుండా సమయానికి వంద శాతం చెల్లింపులు జరగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారుల్లో మహిళా సంఘ సభ్యులు ఉంటే, వారికి ఇల్లు నిర్మాణం కోసం అదనంగా లక్ష రూపాయల రుణం అందించాలని, ఈ ప్రక్రియను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, ఆగస్టు 26న కలెక్టరేట్‌లో టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత ఎక్కువగా సద్వినియోగం చేసుకునేలా, మహిళా సంఘాల సహకారంతో గ్రామాల స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విదేశీ ఉపాధి అవకాశాల గురించి గ్రామీణ యువతకు అవగాహన పెంపుతో పాటు, ఉద్యోగాల కోసం అవసరమైన నైపుణ్యాలను అందించడమే తమ లక్ష్యమని కలెక్టర్ అన్నారు.అంతేకాక, న్యాక్ (ఎన్ఎసి) ఆధ్వర్యంలో సినిమా రంగంలో సినిమా ఫోటోగ్రఫీ, డబ్బింగ్, వాయిస్ ఓవర్, సౌండ్ రికార్డింగ్ వంటి ప్రత్యేక కోర్సులు, అలాగే నిర్మాణ రంగంలో ఫిట్టర్, ప్లంబర్, ఎలక్ట్రిషియన్ వంటి నైపుణ్యాభివృద్ధి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వీటిలో ఆసక్తి ఉన్న యువతను గుర్తించి, వారికి శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలను సృష్టించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ శిక్షణలు యువతకు కేవలం ఉద్యోగ అవకాశాలకే కాకుండా స్వయం ఉపాధికి కూడా దోహదపడతాయని కలెక్టర్ హర్షించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, అదనపు డీఆర్డీఓ రవీందర్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# రోడ్డు మరమ్మత్తులు చేపించరు

**జనం పవర్ జగిత్యాల ఆగస్టు 14:**

జగిత్యాల జిల్లా కేంద్రం నుండి రాయికల్ వెళ్లే మార్గంలోని కండ్లపల్లి, కిష్టంపేట గ్రామాల మధ్య రోడ్డు గుంతల మయ్యం అయ్యింది. అటుగా వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో, చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని స్థానికుల నుండి విమర్శలు వెల్లు వేత్తుతున్నాయి. ఈ రోడ్డు నుండి వెళ్తున్న వాహనాలు రిపేర్లు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.




# గంగాపురి స్టేజి వద్ద భారీ కేట్ల ఏర్పాటు

**ప్రాణాలు పోతే గాని పట్టించుకోని తీరు**

**జనం పవర్, మంథని, ఆగస్టు 14:**

గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలు పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన చేట్టం వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు తిప్పని అభిలాష్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన అనంతరం పోలీసులు అప్పటికప్పుడు బారికేట్లను ఏర్పాటు చేశారు. ముందే రక్షణ చర్యలు తీసుకొని ఉంటే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయేవి కాదు కదా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా స్పందించినందుకు అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అలాగే గంగాపురి చౌరస్తాలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకొని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సహకార సంఘాల పదవీ కాలం మరో 6 నెలలు పెంపు



**మంథని లో సిఎం ,శ్రీధర్ బాబు, తుమ్మల చిత్ర పటాలకు పాలాభిషేకం**

**రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**జనం పవర్, మంథని, ఆగస్టు 14:**

సహకార సంఘాల పదవి కాలం మరో ఆరు నెలలు పొడగించి మాపై ఎంతో బాధ్యతను పెట్టిందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. సహకార సంఘాల పదవి కాలం మరో ఆరు నెలలు పొడగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉతర్వులు జారి చేసిన సందర్భంగా గురువారం సాయంత్రం మంథని సహకార సంఘం పాలవర్గ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ల చిత్ర పటాలకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంఘ పాలకవర్గ సభ్యులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లడుతూ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని సంఘ వ్యాపారాన్ని ద్విగ్విజయంగా సాగిస్తూ సభ్యులు, రైతుల అవసరాలను తీర్చడం జరిగిందని అన్నారు. గ్రామగ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను దళారుల భారి నుంచి కాపాడటం తో పాటు ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరను అందిచడం తో పాటు సన్న వడ్ల కు క్వింటాల్ కు రూ.500 బోనస్ అందిచామని తెలిపారు. అంతే కాకుండా రైతుల కు రూ.2లక్షల రుణ మాఫీ చేశామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నామని తెలిపారు. అంతేగాకుండా సంఘ సభ్యుల వ్యవసాయ పెట్టుబడుల అవసరాలను తీర్చేందుకు సకాలంలో సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేసి వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నామని తెలిపారు. సంఘ పరిధిలోని నాగారం గ్రామ శివారు, నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు ప్రక్కనే 3ఎకరాల 20గుంటల భూమిని కొనుగోలు చేసి రైస్ మిల్లు నిర్మాణానికి తగు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే గుంజపడుగు గ్రామా శివారులోని 4 ఎకరాల ప్రభుత్వ స్థలంలో పిఎం కుసుమ్ ద్వారా రూ.3.50 కోట్లతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పూర్తి చేసుకొని ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా సంవత్సరానికి రూ.50 లక్షల ఆదాయం సంఘానికి సమకూరుతుందని అన్నారు. మరో ఆరు నెలల పదవీ కాలాన్ని పెంచి మాపై ఎంతో బాధ్యతను పెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, టిజిక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావులకు ఈ సందర్భంగా మా సంఘ పాలకవర్గం, రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఇన్ని రోజులు సంఘం అభివృద్ధికి సహకరించిన సభ్యులు, రైతులు, అధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృత్ణతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, సిరిముర్తి ఓదెలు, గడ్డం పోచం, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మిమొండయ్య, ఉడుత మాధవి పర్వతాలు యాదవ్, దేవల్ల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు: ఎంపీ రఘునందన్‌రావు

**జనం పవర్, హైదరాబాద్:**

దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘‘బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం.

బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురద జల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు.

# మంత్రి వీడియో కాన్ఫిరెన్స్ లో జిల్లా కలెక్టర్

**వరదల్లో ప్రాణ నష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి**

**వరద సహాయక చర్యల కోసం జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయల విడుదల**

**భారీ వర్షా ల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా నిల్వల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి వర్యులు పొంగులేటి**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 14**



వాతావరణ శాఖ సూచనల మేరకు రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురిసే అతి భారీ వర్షాలతో ఎక్కడ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా నిల్వల పై సీఎస్ కే.రామకృష్ణ రావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్య ప్రసాద్. అదనపు కలెక్టర్ బిఎస్ లతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 2 రోజుల నుంచి అతి భారీ వర్షాలు రాష్ట్రంలోనే కొన్ని ప్రాంతాలలో కురుస్తున్నాయని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వరద పరిస్థితుల పై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలకు ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా విడుదల చేస్తామని అన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని అన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తిస్థాయిలో తీసుకోవాలని అన్నారు. అలాగే సిఎస్ కే.రామకృష్ణ రావు మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచన ప్రకారం తూర్పు, దక్షిణ ప్రాంతాలలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసిందని అన్నారు. మిగిలిన ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిందని అన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్ వద్ద ఉన్న డిజాస్టర్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. వరద అంచనా వేస్తూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా అధికారులు పనిచేయాలని సిఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, చెరువుల సమీపంలో గల రోడ్లు, కల్వర్టు. వంతెనలను మూసి వేయాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో కొన్ని కాలనీలలో ఇండ్లకు నీళ్లు వచ్చే అవకాశం ఉందని, అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రజల అవసరమైతేనే బయటకు రావాలని అన్నారు. రాష్ట్రంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని, రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో పెట్టాలని, ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, నీటిపారుదల శాఖ. వైద్య ఆరోగ్యశాఖ. వ్యవసాయ శాఖ. డిపిఓ మదన్ మోహన్. ఆర్ అండ్ బి అధికారి శ్రీనివాస్. సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సు

**జనం పవర్, గోదావరిఖని ఆగస్టు 14:**

గోదావరిఖని డిపో ఆధ్వర్యంలో ఆగస్టు 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేయబడింది. ఈ యాత్రలో కాణిపాకం, అరుణాచలం, వేలూరు గోల్డెన్ టెంపుల్, విష్ణు కంచి, శివకంచి, అలంపూర్ జోగులాంబ క్షేత్రాల దర్శనాలు కలిగి, ఆగస్టు 21న తిరిగి గోదావరిఖనికి చేరుకుంటారు. పెద్దలకు 5,600 రూపాయలు, పిల్లలకు 4,400 రూపాయల చార్జీగా నిర్ణయించారు. సమస్త గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ మరియు పరిసర ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో అధికారులు సూచించారు. వివరాలకు 7013504982, 9032633273 నంబర్లను సంప్రదించవచ్చు.

# గంగాపురి స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి**

**ప్రమాదాల హాట్‌స్పాట్‌గా మారిన గంగాపురి చౌరస్తా**

**జనం పవర్, మంథని ఆగస్టు 14:**



మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాలుగవ వార్డు గంగాపురి చౌరస్తా ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోంది. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో లారీ (ఏపీ 15 ఎక్స్ 7254) యమహా ఆర్15 ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో, పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన చేట్టం వెంకటేష్ (30) అక్కడికక్కడే మృతి చెందగా, తోడుగా ఉన్న మంథని మండలం ధర్మారం (గద్దలపల్లి) గ్రామానికి చెందిన తిప్పని అభిలాష్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రదేశంలో గతంలోనూ పలువురు మృత్యువాత పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. నార్ల వెంకటేష్ సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొని మృతి చెందడం, మల్హర్‌రావు మండలం తాడిచెర్లకు చెందిన వ్యక్తి గంగాపురిలో బంధువుల దశదిన కర్మలో పాల్గొని తిరిగి వెళ్తుండగా బస్సు ఢీకొని మృతి చెందడం, ఈ ఏడాది ఆరంభంలో బోయిన్‌పేట్‌కు చెందిన యువకుడు కారు-ట్రాక్టర్ ఢీకొని మృతి చెందడం వంటి ఘటనలు గంగాపురి స్టేజి వద్ద జరిగినవే. ఇన్ని ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు గాని, సురక్షా చర్యలు గాని చేపట్టకపోవడం స్థానికుల ఆగ్రహానికి కారణమైంది. గంగాపురికి ఆనుకొని ఉన్న సత్యసాయి రైస్‌మిల్లుకు ఎదురుగా ప్రమాదకర మూలమలుపు ఉండడం, ప్రధాన రహదారి విస్తరించడంతో వాహన రాకపోకలు పెరగడం, వాహనదారులు అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయి. గంగాపురి స్టేజి నుంచి ముత్తారం మండల దిశగా వెళ్లే రహదారిలో ఎస్ఆర్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్, ఆర్ఆర్ గార్డెన్స్ ఉండడం వల్ల ఎల్లప్పుడూ రద్దీగా మారుతోంది. చౌరస్తా వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు నియంత్రణ లేకుండా ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని గంగాపురి స్టేజి వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# గోదావరి నది నీటి ప్రవాహ పరిశీలన

**భారీ వర్షా ల దృష్ట ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచన**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 14**



జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని గోదావరి నది ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పి అశోక్ కుమార్ గురువారం సందర్శించారు. నది వద్ద ప్రస్తుత నీటి మట్టం, ప్రవాహం వేగం, సేఫ్టీ బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. భారీ వర్షాల వల్ల ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుండి నీటి ప్రవాహం కొనసాగుతున్న దృష్ట గోదావరి నీటి ప్రవాహం ఉదృతంగా ఉంటుందన్నారు. గోదావరి నది ప్రవాహాన్ని చూడడానికి, నదిలో దిగడం గాని నది వద్ద సెల్ఫీలు, ఫోటోలు తీసుకోవడం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని. నది వద్దకు వెళ్ళకూడదని ప్రజలకు సూచించారు. ప్రజలు నీటి ఉధృతిని అంచనా వేయకుండా స్నానాలు చేయడానికి నది లోపలికి వెళ్లే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆలయ అధికారులు సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్ గా ఉండాలని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్య పర్చాలని సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెంట ధర్మపురి సిఐ రాం నరసింహా రెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, ఆలయ చైర్మన్ రవీందర్, ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరగాళ్ల కొత్తరకం మోసం..

**బాధితుడి నుంచి రూ.5.41లక్షలు కాజేసిన నిందితులు**

**జనం పవర్, హైదరాబాద్:**

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసానికి తెరలేపుతున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని చుడిబజార్‌కు చెందిన బాధితుడి నుంచి రూ.5.41లక్షలు కాజేశారు. బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూటరీ కోసం చుడిబజార్‌కు చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇది గమనించిన సైబర్‌నేరగాళ్లు.. ఓపస్ బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూటర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఫోన్ నెంబరు, వివరాలు పేర్కొన్నారు. అందులోని ఫోన్ నెంబర్‌కు బాధితుడు ఫోన్ చేయగా.. డిస్ట్రిబ్యూటర్‌గా రిజిస్ట్రేషన్, డెలివరీ, ఇతర ఖర్చుల పేరుతో రూ.5.41లక్షలు సైబర్ నేరగాళ్ల తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

# భూ సేకరణ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూ సేకరణ వేగవంతం చేయాలని, సేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ సంచాలకులు దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, రెవిన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబుతో గురువారం భూసేకరణ సమస్యలపై ఆమె సమావేశం నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఇప్పటికే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సహకరించేలా చూడాలని అన్నారు. భూసేకరణలో ఉన్న సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జా తీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలని సూచించారు. ఇందు కు అధికారులకు పలు సూచనలు చేశారు.

### సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన

కరీంనగర్ పట్టణంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ స్థలాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఎన్ పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేష్ బాబుతో కలసి పరిశీలించారు. నగరంలోని ఆర్ అండ్ బి ఎస్.ఇ కార్యాలయ ప్రాంగణం, జిల్లా పశు వైద్యశాల, మహాత్మా జ్యోతిబాపూలే మైదానం, జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణ, కలెక్టరేట్ ప్రాంగణం, ఆటోనగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.నగరంలో ఇప్పుడు ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లపై ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు కొత్తగా మూడు సబ్ స్టేషన్లు నిర్మించనున్నారు. ఇందులో ఒకటి ఇండోర్ సబ్ స్టేషన్ కాగా మరో రెండు ఓపెన్ సబ్ స్టేషన్లు. పరిశీలించిన స్థలాల్లో మూడు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డి.ఈ రాజం,ఈఈశ్రీనివాస్, ఏడిఈలు అంజయ్య, శ్రీనివాస్ లావణ్య,అర్బన్ తహసిల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

ఏసీపీ, సీఐలకు కలిసిన

## టీఎన్జీవోల నాయకులు



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** కరీంనగర్ రూంల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎల్. రామచంద్రరావులను టీఎన్జీవోల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు అధికారులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, నాగుల నరసింహస్వామి, సర్దార్ హర్మేందర్ సింగ్, సందీప్ రావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రమేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ప్రణవ్‌కు వినతి



**జనం పవర్,వీణవంక ఆగస్టు 14:** వీణవంక మండల పరిధిలోని లస్మక్కపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆ గ్రామ కాంగ్రెస్ కార్యకర్త మద్దుల ప్రశాంత్ పటేల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను కలిశారు.గురువారం ఆయనకు వినతి పత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామంలో పలు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు సెంట్రల్ లైటింగ్, బోరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని విన్నవించారు.కాంగ్రెస్ ప్రభుత్వం లోనే ప్రజాసమస్యలకుపరిష్కారం దొరుకుతుందని, త్వరలో గ్రామ అన్నిసమస్యలు పరిష్కారమవు తాయని యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్ ఆశా భావం వ్యక్తం చేశారు.ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగరనుందని, గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకెళ్తాయని ప్రశాంత్ పేర్కొన్నారు.

## ముత్యాలమ్మకు బోనాలు

జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 14: మాడుగులపల్లి మండల పరిధిలోని చిరుమర్తి గ్రామంలో గురువారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ఆచారం ప్రకారం శ్రావణమాసం చివరి వారంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం వల్ల ఊరికి ఊరి ప్రజలకు ఎటువంటి కీడు హాని జరగకుండా ఊరికి గ్రామ దేవత ఐన ముత్యాలమ్మ మా ఊరిని ప్రజలను పిల్ల పాపాలను సల్లగా చూడలని బోనాలతో నైవేద్యం సమర్పిస్తారు తర్వాతి రోజున గ్రామస్తులందరూ వన మహొూత్సవాలు జరుపుకోవాలని పూర్వం నుంచి వస్తున్న ఆచారం బోనాల పండుగను ఊరందరూ కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**జనం పవర్, వేములవాడ, ఆగస్టు 14:** ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 40 మంది లబ్ధదారులకు రూ.12 లక్షల 93 వేల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని చెప్పారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్‌ఓసి ల ద్వారా ఇప్పటి వరకు రూ.22 కోట్ల పై చిలుకు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించాలి



## ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా స్థానిక సమస్యల పరిష్కారంలో పురోగతి లేకుండా పోయిందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక కోతి రాంపూర్, కట్ట రాంపూర్ కాలనీలలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, కోతి రాంపూర్ లో డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక ఇళ్లలోకి మురుగు నీరు వచ్చి చేరుతుందన్నారు. తద్వారా స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ముందు రోడ్డుపైన అనేక గుంతలు ఏర్పడ్డా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మానేరు ఉన్నప్పటికీ, పట్టణ ప్రజలకు ప్రతి రోజు తాగునీరు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రె స్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీ లు అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, రేషన్ కార్డు లేని పేదలకు తక్షణమే రేషన్ కార్డులు ఇవ్వాలని, నగరంలో రహదారులు, డ్రైనేజీలు బాగు చేయాలని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. తమహక్కుల కోసం మహిళలు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావఅన్నపూర్ణ, గుడికందుల సం ధ్య, మంచినీళ్ల లావణ్య, ఉప్పునూటిలక్ష్మి, స్రవంతి, భవాని రమ,రజిని, మున్నా,అంజలి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలని మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** ఉద్యోగ, ఉపాధ్యాయుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా గోడ ప్రతులనుగురువారం స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో ఆవిష్కరించారు. పిఆర్టీయు(టియస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మడిపల్లి కాళీ చరణ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ, ఉపాధ్యా యుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మహాధర్నా విజయవంతం చేయడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ కలసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం నాయకులు లక్ష్మణ రావు, కిరణ్ కుమార్ ,రాజేష్ ఉమ్మడి జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ స్వామి, శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుపల్లిలో జాతీయ జెండా ఆవిష్కరణ

**జనం పవర్, మాడుగులపల్లి ఆగస్టు 14:** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10: 30కి 79వ స్వాతంత్ర దినోత్సవ తిరంగా ర్యాలీ బిజెపి మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి , కిసాన్ మోర్చా నాయకులు గోలీ మధుసూదన్ రెడ్డి లు పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా మండలంలోని చెరువుపల్లి గ్రామంలో రైతులచే జాతీయ జెండా ఆవిష్కరణ కార్య క్రమం నిర్వహించడం జరుగుతున్నారు.

## రామకృష్ణ కాలనీలో మహనీయుల విగ్రహాల శుద్ధి




**జనం పవర్, తిమ్మాపూర్, ఆగస్టు 14:** తిరంగా అభియాన్ కార్యక్రమం లో భాగంగా తిమ్మాపూర్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో గురువారం రామకృష్ణ కాలనీలోని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహనీయులకు ఘననివాళులు అర్పించారు. అనంతరం తిరంగా ర్యాలీ చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు బి కళ్యా ణ్ చంద్ర మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రతీకగా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సూచన మేరకు ప్రజ లతో కలిసి తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి,కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి,ఎడ్ల జోగిరెడ్డి,బండి సాగర్, తిరుపతి రెడ్డి,వేల్పుల ఓదెలు,బుర్ర శ్రీనివాస్, చింతం లక్ష్మణ్, కామెర వెంకటేష్, రాజు, పల్లె శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్టు 14:** అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం అయ్యప్ప మాల వేసుకున్న స్వాములకు, ఆగస్ట్ 15వ తేదీన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు జన్మదిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యప్ప స్వాములకు బిక్ష పెట్టారు. ప్రణవ్ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని రానున్న రోజుల్లో తాను ఉన్నతమైన పదవులు పొందాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**జనం పవర్, హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 14:** హుజూరాబాద్ పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో గురువారం రోజున కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కృష్ణ, గోపిక వేషధారణలో పాఠశాలకు వచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకుంటామని, ప్రపంచానికి భగవద్గీత అందించిన కృష్ణుడి పుట్టినరోజు చాలా మంచి రోజు అని తెలియజేశారు. తదనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో గోపిక, కృష్ణ వేషధారణలోని పిల్లలు నృత్యాలు చేశారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు పాల్గొని సందడి చేశారు. ఆ తర్వాత ఏర్పాటుచేసిన ఉట్టి కార్యక్రమం అందరిని ఆనందింపజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ యాదవ్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మూసివేసిన బాలికల వసతి గృహాన్ని తెరిపించాలి




**జనంపవర్, కరీంనగర్, ఆగస్టు 14:** స్థానిక మంకమ్మ తోటలోని బీసీ బాలికల వసతి గృహాన్ని విద్యార్థులు లేరనే కారణంతో మూసి వేశారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో వసతి గృహం లోని విద్యార్థులను వేరే చోటికి తరలించారని చెప్పారు. ఈ వసతి గృహానికి పూర్తిస్థాయి సంరక్షణ అధికారి ఉండగా, ఆ అధికారిని ఇతర జిల్లాలకు డిప్యుటేషన్ పంపి, అదనపు బాధ్యతలను వేరే అధికారికి అప్పగించడంతో సరైన పర్యవేక్షణ కరవై విద్యార్థుల సంఖ్య తగ్గు ముఖం పెట్టిందన్నారు. ఈ వసతి గృహానికి చెందిన సంరక్షణ అధికారిని ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్ పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంక్షేమ శాఖ అధికారులు మూసివేసిన వసతి గృహాన్ని బీసీ బాలికల కళాశాల వసతి గృహంగా మార్చాలని కోరారు. పట్టణంలో నాలుగు కళాశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాలు ఉండగా, అందులో 200 పైగా విద్యార్థులను చేర్చుకుంటున్నారనీ, అయినప్పటికీ ఇంకా చాలామంది విద్యార్థులకు వసతి దొరకడం లేదన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంకమ్మ తోటలో మూసివేసిన బిసి బాలికల పాఠశాల వసతి గృహాన్ని వెంటనే కళాశాల బీసీ బాలికల వసతి గృహంగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఓపెన్ జిమ్‌ను వేరే చోటుకు తరలించాలి

**జనం పవర్, హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 14:** మోడల్ చెరువులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా ఉంది దానిని ప్రజలు ఉపయోగించే విధంగా వేరే చోటుకి ఏర్పాటు చేయడం గురించి హుజూరాబాద్ పట్టణంలో 2,17, వార్డుల అను సంధానంగా గతంలో ప్రభుత్వం మోడల్ చెరువులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కానీ ఎప్పటికీ అందులో నీళ్లు ఉండడం వలన ఎవరికి ఉపయోగం లోకి రావడం లేదు. మోడల్ చెరువులో ఉన్న ఓపెన్ జిమ్ సామాగ్రిని జనవాసంలో మార్చి ప్రజలకు 2,17, వార్డుల వినియోగించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

# స్వల్పంగా పెరుగుతున్న ముర్రేడు వాగు!

**- ఇళ్లకు పొంచి ఉన్న ప్రమాదం**
**- బిక్కుబిక్కుమంటు కాలం గడుపుతున్న కుటుంబాలు**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** భద్రాద్రి జిల్లా కేంద్రంలోని మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ముర్రేడు వాగు స్వల్ప ఉధృతితో ప్రవహిస్తుంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిస్తే మాత్రం ముర్రేడు వాగు ఉధృతంగా ప్రవహించడంతోపాటు వాగు పక్కనే ఇండ్లకు ప్రమాదం తప్పేటట్లు లేదు. పదిహేనేళ్ల క్రితం భారీ వర్షాలకు వాగు పొంగి సుమారుగా 10 ఇండ్లకు పైగా నేలమట్టం అయినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరైతే ఇండ్లకు తాళాలు వేసుకొని వలస పోయినట్లుగా తెలిపారు. వర్షాలు ఎక్కువ కురిసిన సమయంలో వరద ఉధృతికి వాగు కోతకు గురవుతుండడం వల్ల వాగు వైశాల్యం పెరిగి ఇండ్లు కూలిపోతున్న పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. వాగు కోతకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సంజయ్ నగర్ ,ప్రశాంత్ నగర్, శ్రీనగర్ వాసులు అధికారులకు విజ్ఞప్తి చేయగా గత ప్రభుత్వం ఎట్టకేలకు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసింది. కానీ నేటి వరకు పనులు మొదలు కాని పరిస్థితి నెలకొంది. అప్పుడే పనులు ప్రారంభించినట్లయితే ఇప్పటి వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయి ఉండేదని ప్రజలు పేర్కొంటున్నారు. మళ్లీ వర్షాకాలం రావడం అడపాతడప కురుస్తున్న వర్షాల వల్ల వాగు స్వల్పంగా ప్రవహిస్తుండడంతో కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాయి. రాత్రి సమయంలో కొందరైతే నిద్ర కూడా పోనీ పరిస్థితి ఉందని పలువురు ఆపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదలు కాకపోవడం వల్ల ముర్రేడు వాగు పక్కనున్న కుటుంబాల్లో హైటెన్షన్ నెలకొంది.

**2023లో శంకుస్థాపన.. జరగని పనులు...**

వర్షాకాలం సమయంలో అధిక వర్షాలు కురిస్తే ముర్రేడు వాగు పొంగి వాగుకు ఆనుకుని ఉన్న ఇండ్లు నేలమట్టం అవుతున్నాయి. ఇలా జరగకుండా ఉండేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.33.50 విడుదల చేస్తున్నట్లు ప్రకటించి 2023 అక్టోబర్ నెలలో శిలా ఫలకం వేసింది. శిలాఫలకం వేసి దాదాపు 23 నెలలు కావస్తున్న నేటికీ రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం తట్ట సిమెంట్ కూడా పడలేదు. దీంతో వాగుపక్కనున్న కుటుంబాల్లో కలవరం నెలకొంది. భారీ వర్షాలు వచ్చి ముర్రేడు వాగు పొంగితే మా పరిస్థితి ఏమిటంటే ఆందోళన చెందుతున్నారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు మేలుకొని వాగు పక్కన సపోర్టింగ్ పనులు మొదలుపెట్టి ఇండ్లు కూలిపోకుండా చూడాలని కుటుంబాలు వేడుకుంటున్నాయి.

**ఇండ్లు నేలమట్టం కాకుండా చూడాలి..**



ముర్రేడు వాగు పక్కన ఇండ్లు వరద తాకిడికి నేలమట్టం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ డిమాండ్ చేశారు. వరద నీటి తాకిడికి కోతకు గురవడం వల్ల ఇండ్లు నేల మట్టం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గత ప్రభుత్వం ప్రకటించిందని కానీ నేటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని మాలోత్ గాంధీ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**జనం పవర్, వరంగల్, ఆగస్టు 14:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి శివారులో గల 70 డబుల్ బెడ్‌రూం ఇళ్ల భవన సముదాయాన్ని గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు పడక గదులలో ఆర్అండ్‌బీ శాఖతో చేపడుతున్న మరమ్మతులు, ట్రాన్స్‌పార్మర్స్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి దివ్యాంగ లబ్ధిదారులకు అందించుటకు సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన అంతర్గత రోడ్డును ఎమ్మెల్యే నాగరాజు పరిశీలించారు. ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటి గ్రీనరిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యనవనాల అధికారిలకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంత పక్కకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఇందుకోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, స్థానిక కార్పొరేటర్ జన్ను శీభరాణి - అనిల్ కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**జనం పవర్, వరంగల్, ఆగస్టు 14:** నర్సంపేట పట్టణంలోని సామాజిక సేవకుడు, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్‌కు గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ చేశారు. ఆయన అనారోగ్యానికి గురై ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకోగా ఎక్కువ మొత్తంలో ఖర్చులు కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 21,000 మంజూరయ్యాయి. కాగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశానుసారం 21వ వార్డు ఇంచార్జి, మాజీ వార్డ్ మెంబర్ కొయ్యడి సంపత్, మాజీ వార్డ్ మెంబర్ గాజుల రమేష్‌లు చెక్కును బెజ్జంకి ప్రభాకర్‌కు అందజేశారు.

## శస్త్రలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు




**జనం పవర్, హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 14:** శ్రీ మహా విష్ణువు ఎనిమిదవ అవ తారంగా కృష్ణాష్టమి రోజున కృష్ణుడు జన్మించాడని హిందువులు నమ్ముతారు. ఈ పండుగ ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకుంటారు. కృష్ణాష్టమి, భక్తి, ఆనందం, సాంస్కృతిక సంపదలను పంచుకునే పండుగ. అటువంటి పండుగలో భాగంగా హుజురాబాద్ పట్టణంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శస్త్ర పాఠశాలలో చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలతో ఆట పాటలతో నృత్యాలు చేశారు. విద్యార్థులు పెరుగు బసంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటపాటలతో ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వేణుమాధవ్, ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీసీసీ బీసీ సెల్ కార్యదర్శిగా కోల రమేష్



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** స్థానిక మారుతీ నగర్ కు చెందిన కోల రమేష్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ గురువారం ఆయనకు నియామక పత్రా న్ని అందజేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరిన కోల రమేష్ నాటి నుంచి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారని తెలి పారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులకు కోల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా తిరంగా ర్యాలీ



**జనం పవర్, హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 14:** హుజురాబాద్‌లో గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధుడు మహాత్మ గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తూర్పాటి రాజు మాట్లాడుతూ భారత జాతిని ఏకం చేసే జాతీయ జెండాను ప్రతి పౌరుడు ఇంటపైన ఎగిరే విధంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రధాని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని చెప్పారు.

దేశ సార్వభౌమత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక మన మువ్వ న్నెల జెండా అన్నారు. దేశ భక్తికి, సమగ్రతకు, జాతీయ భావానికి, ఐక్యతకు కూడా ప్రతిబింబమన్నారు. ఈ మూడు రంగుల జెండా దేశ ప్రజలందరినీ ఎక తాటిపైకి తెచ్చేందుకు త్రివర్ణ పతాకాన్ని మించిన సాధనం ఉండదన్నారు. అందుకే మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు సంవత్సరాల క్రితం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా పేరిట దేశంలోని ప్రతి పౌరుడు తమ ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేసి దేశ భక్తిని చాటాలని పిలుపు ఇచ్చారన్నారు. అందుకే మేరకు ప్రతి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పదాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జన్మదిన వేడుకలు



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 14:** జుక్కల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బిచ్కుంద మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన పురవీధుల గుండా భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి ర్యాలీ తీశారు. పెద్ద ఎత్తున బాణా సంచాలు కాల్చారు. బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యకర్తలు, అభిమానులు హన్మత్ షిండేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మావోయిస్టులు అడవిని వీడి బయటికి రావాలి

**- స్వేచ్ఛాయుత జీవనం గడపండి - ఎస్పీ రోహిత్ రాజు**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** మావోయిస్టులు అడవిని వీడి బయటికి రావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోరారు. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగు దళ సభ్యులు గురువారం ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు సిఆర్పిఎఫ్ బెటాలియన్ అధికారులు ఆధివాసీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూతలో కార్యక్రమం ద్వారా లొంగిపోయిన దళ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకొని మిగతావారు కూడా లొంగిపోవడం జరుగుతుందని తెలిపారు.

నక్సలిజాన్ని విడనాడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ స్థాయిలలో పనిచేస్తున్న ఆరుగురు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడం జరిగిందన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోఈ సంవత్సరం జనవరి-2025 నుంచి ఇప్పటివరకు 306 మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయినట్లుగా వివరించారు. క్షీణదశలో ఉన్న మావోయిస్టు పార్టీ భవిష్యత్తును చూసి క్రిందిస్థాయి



క్యాడర్లు పై స్థాయి క్యాడర్ల ఆదేశాలను వ్యతిరేకి రహస్య ఉద్యమ జీవి నుండి బయటకు వచ్చి తమ తమ గ్రామాలకు వెళ్లి కుటుంబాలతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం ఇప్పటి వరకు 306 మంది సాయుధ దళ సభ్యులు కేవలం ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే జనజీవన స్రవంతిలో కలిసి తమ కుటుంబాలలో శాంతియుత జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు.

# పాత్రికేయులు ప్రజాపక్షంగానే పనిచేయాలి

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 14 :** పాత్రికేయులు ఎప్పటికీ ప్రజాపక్షంగానే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికై వారదులుగా వ్యవహరించాలని, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పాత్రికేయుల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులో పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. నిజా నిజాలు నిర్ధారించుకొని రాసే వార్తలకు ఎప్పటికీ ప్రజాధరణం ఉంటుందని మొక్కుబడి వార్తలు వ్యక్తిగత విమర్శలతో కూడిన వార్తలు నిరాధార వార్తలు మనుషుల మధ్య వ్యత్యాసాన్ని పెంచుతాయే తప్ప దేనికి ఉపయోగపడని అలాంటి వార్తలను రాసే వాళ్లను సైతం ప్రోత్సహించరాదని ఎమ్మెల్యే సూచించారు. జర్నలిస్టులకు ఉన్న సమస్యలు తెలుసునని వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి జర్నలిస్టుకు భేదాభిప్రాయాలు లేకుండా ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తాను సొంతంగా జర్నలిస్టు కుటుంబాలకు భీమా చేయిస్తానని చెప్పానని అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక నాయకులు, జర్నలిస్టులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఖిల్లా గణపురం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవన అభివృద్ధికి తాను ఎల్లవేళలా సహకరిస్తానని రానున్న రోజుల్లో ఖిల్లా గన్నపురం ప్రెస్ క్లబ్ జిల్లాకే మోడల్ గా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు విజయకుమార్, శ్యాంసుందర్, రవి నాయక్, ఆగారం ప్రకాష్, రమేష్, నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి పాటు పడిందని ఇందులో భాగంగానే వసతి గృహాల్లో, గురుకులాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిం చాలని ఉద్దేశంతో 40% మెస్ చార్జీలను పెంచి ఇస్తోందని ఎమ్మె ల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యవంతంగా అందించాలనీ ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కుర్మపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం




**జనం పవర్, చింతపల్లి (నల్గొండ) ఆగష్టు 14:** ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్న కుర్మపల్లి హెడ్మాస్టర్ నారాయణరెడ్డి చింతపల్లి మండలంలోని కుర్మపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, యువకుల, దాతల సహాయంతో కుర్మపల్లి హెడ్మాస్టర్ నారాయణరెడ్డి పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు విద్యార్థుల విషయంలో పూర్తి భరోసా కల్పిస్తానని చెప్పారు గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రుల చొరవతోని 40 ఉన్న సంఖ్యను120 పెంచారు7 గురు టీచర్లతోని అర్థమయ్యే పద్ధతిలో విద్య బోధించడం ప్రతి శుక్రవారం జీకే టెస్టులు పతి బుధవారం స్పోర్ట్స్ డ్రెస్సులు వేసుకొని రావడం ప్రతినెల శనివారం రోజున తల్లిదండ్రులతో మీటింగ్ జరపడం జరుగుతుంది. ప్రతిరోజు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివేలా విద్యార్థులను ప్రోత్సహిస్తు న్నారు అర్థమయ్యేలా పాఠంశాలను బోధించడంతోపాటు క్రమశిక్షణతో మెలిగేలా చూస్తున్నారు. బడికి భయంతో కాకుండా ఇష్టంతో అడుగుపెట్టేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, యువకులు దాతల సహాయంతోని పాఠశాలను ముందుకు తీసుకెళ్తానని కురుమపల్లి హెడ్మాస్టర్ నారాయణరెడ్డి జనం పవర్ న్యూస్‌తో తెలిపారు.

# పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 14:** వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాణి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా చిన్నారులకు కృష్ణుని వేషధారణ, గోపికలు వేషధారణం వేయించి గోపిక కృష్ణ వేషధారణలతో విద్యార్థులు అందర్నీ ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా మన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా ఉన్న శ్రీ కృష్ణాష్టమి పండుగ ప్రత్యేకత గురించి విద్యార్థులు ఉపన్యాసాల ద్వారా తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శన చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు కోలాటం ఆడుతూ పాటలతో ఆనందంగా నృత్య ప్రదర్శన చేశారు. చివరిగా కార్యక్రమాన్ని బాలకృష్ణ వేషధారణలో ఉన్న విద్యార్థులు పది అడుగుల ఎత్తులో ఉన్న ఉట్టిని కొట్టే కార్యక్రమం అందర్నీ ఆకర్షించింది. శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా జరుపుకొనే రేపటి పండుగను ముందుగానే పాఠశాలలో విద్యార్థులకు పండుగ విశిష్టత తెలియజేయా లనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చాలా ఘనంపాఠశాలలో గా నిర్వహించుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతాగంగాధర్, వి. పి.అభి లాష, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూమన పండుగల విశిష్టత గురించి విద్యా ర్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో విద్యార్థులకు కృష్ణుని, గోపికల వేషధారణలు వేయించి వారితో ఉట్టిని కొట్టించే సాంప్రదాయం చాలా బాగుందని, శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం. కృష్ణ జన్మాష్టమిని కృష్ణాష్టమి అని లేదా జన్మాష్టమి లేదా గోకులాష్టమి లేదా అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు. ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేస్తూ అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

**చింతపల్లి(నల్గొండ):** చింతపల్లి మండలంలోని కుర్మేడు రోడ్డు వద్ద నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణుని వేషాదరణలో విద్యార్థినీలు గోపికల వేశాదరణలో అలరించారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అనంతల గౌడ్ మాట్లాడుతూ చదువుతోపాటు ఆధ్యాత్మిక తను కూడా అలవరించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయినీలు వంశీకృష్ణ, పాండు, వెంకటేశు, సంధ్యారాణి, మాలతి,కావ్య, మమత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం




**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 14 :** వనపర్తి జిల్లా శ్రీరామ థియేటర్ వార్ 2 సినిమా విడుదల సందర్భంగా గురువారం వనపర్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున, ఫ్యాన్స్ వనపర్తి ఎన్టీఆర్ సేవాసమితి వనపర్తి జిల్లా 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి బెనిఫిట్స్ షో నుంచి థియేటర్ రాత్రి 9 గంటల వరకు అభిమానుల కోలాహలం బాణాసంచాలతో ఆనందింపజేశారు.

## సీపీఎం ఆధ్వర్యంలో
## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగష్టు 14:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా,కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఏజెంట్‌గా పని చేస్తున్న విధానానికి నిరసనగా గురువారం మాడుగులపల్లి మండల కేంద్రంలో నార్కెటపల్లి, అద్దంకి హైవేపై నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈసందర్భంగా సిపిఐఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఓటింగ్ మిషన్లను ట్యాంపరింగ్ చేసి గద్దె మీదికి వచ్చింది. దొంగతనంగా గద్దె మీద కూర్చున్నటు వంటి బిజెపి ప్రభుత్వం నేడు బీహార్ రాష్ట్రంలో ఓటర్ల నమోదు జాబితా కార్యక్రమాన్ని తీసుకొని బ్రతికున్న ఓటర్లని చనిపోయినట్లుగా సృష్టించి వారి ఓట్లను తొలగించడం జరిగింది. దీనికి ఎన్నికల సంఘం కూడా వారికి ఏజెంట్గా పని చేస్తూ ఉన్నది అంటే స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వానికి బినామీగా పనిచేస్తున్నటువంటి పరిస్థితి భారతదేశ వ్యాప్తంగా ఏర్పడింది. దీని ద్వారా సామాన్య ప్రజానీకం అలాగే ఇతర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలకు ఆయా రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా పాలన సరిగ్గా చేయకుండా అడ్డుపడుతున్నటువంటి పరిస్థితి ఉన్నది. అక్కడ ఓట్లు తొలగించి, మిగిలిన ఓట్ల ద్వారా బిజెపి ప్రభుత్వానికి ఎక్కువ ఓట్లు రావాలనే దురుద్దేశంతోవ్యవహరిస్తున్నటువంటిపరిస్థితి ఉన్నది దీనిద్వారా వారికి ఓట్లు మెజారిటీ గా రావాలని ఈ పని చేస్తున్నది కాబట్టి ఈ ప్రజా వ్యతిరేక విధానాలని వెనకకు తీసుకోకపోతే సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో అనేక ఆందోళన నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘం రాష్ట్ర నాయకులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్, సిపిఎం మండల నాయకులు బొంగర్ల వెంకటయ్య, జుకూరు నాగయ్య, నాయకులు అలుగుబిల్లి నర్సిరెడ్డి,మేడి రవి, సిఐటియు జిల్లానాయకులు బొంగర్ల ఎల్లయ్య, హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం





**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 14 :** స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సాయంత్రం పరిశీలించారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకా విష్కరణ చేయనున్నారని, అనంతరం ముఖ్య అతిథి జిల్లా ప్రజలను ఉద్దేశం చి ప్రసంగిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వనపర్తి జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో చేస్తున్న ఏర్పా ట్లను పరిశీలించిన కలెక్టర్ వర్షం వచ్చినా వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసు కోవాలని కలెక్టరేట్ ఏఓ భానుప్రకాశ్‌ను ఆదేశించారు. విద్యార్థులు, అధికారులు, ప్రజలు వేడుకలను వీక్షించడానికి అనువైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాట్లను సైతం పరిశీలించారు.

# సహకార సంఘాల పదవీ కాలం ఆరు నెలలు పెంపు

**జనం పవర్, మంథని ఆగష్టు 14:** సహకార సంఘాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించడం ద్వారా తమపై మరింత బాధ్యతను ఉంచిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్. ఈసందర్భంగా గురువారం సాయంత్రం సంఘ పాలకవర్గ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, అనేక ఆటుపోట్ల మధ్య సంఘాన్ని విజయవంతంగా నడిపి, గ్రామాల వారీగా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను దళారుల దోపిడీ నుంచి కాపాడటంతో పాటు ప్రభుత్వ మద్దతు ధరను కోతలు లేకుండా చెల్లించామని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అందించామని, ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నామని తెలిపారు. సభ్యుల వ్యవసాయ పెట్టుబడుల కోసం స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో అందజేస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నామని, నాగారం శివారులో 3 ఎకరాలు 20 గుంటల భూమి కొనుగోలు చేసి రైస్ మిల్లుల నిర్మాణానికి కసరత్తు జరుపుతున్నామని, గుంజపడుగు శివారులో 4 ఎకరాల ప్రభుత్వ భూమిపై పీఎం కుసుమ్ పథకం ద్వారా రూ.3.50 కోట్లతో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని,దీని ద్వారా సంవత్సరానికి రూ.50 లక్షల ఆదాయం వస్తుందని తెలి పారు. పదవీకాలం పొడిగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టిజిక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావులకు, అలాగే సంఘ అభివృద్ధికి సహకరించిన సభ్యులు, రైతులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, సిరిమూర్తి ఓదెలు, గడ్డం పోచం, కిషన్ రెడ్డి, దాసరి లక్ష్మీ-మొండయ్య, ఉడుత మాధవి-పర్వతాలు యాదవ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఎరువులను
## తరలిస్తున్న వాహనం పట్టివేత

**జనం పవర్, చెన్నూరు, ఆగష్టు 14:** మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి పొరుగున ఉన్న మహారాష్ట్రకు అక్రమంగా వాహనంలో తరలిస్తున్న ఎరువులను ఫర్టిలైజర్స్ సీజ్ చేసిన కోటపల్లి పోలీసులు పట్టుకున్నారు. చెన్నూరులోని లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణం నుంచి బొలెరో వాహనంలో డీఏపీ 32 బస్తాలు, 20-20 బస్తాలను మహారాష్ట్రకు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు కోటపల్లి ఎస్సై రాజేందర్ తెలిపారు. జాతీయ రహదారి నెంబర్ 63 పై గురువారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా ఎరువులను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మహారాష్ట్రకు ఎరువులు తరలి వెళ్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. అందులో భాగంగా తనిఖీలు చేస్తుండగా వాహనం పట్టుబడినట్లు ఎస్సై వివరించారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# పంచాయతీలను, హెల్త్ సబ్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో

**జనం పవర్, జైపూర్, ఆగష్టు 14:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు జైపూర్ మండలంలోని గంగిపెల్లి, శెటపెల్లి, కుందారం, గ్రామపంచాయతీని ఆవ్ ఇన్స్పెక్షన్ లో భాగంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. హెల్త్ సబ్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేసి, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య పనుల ను, నర్సరీ, సెగ్రి గేషన్ షెడ్, స్మశానవాటిక ను పరిశీలిం చారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో నీటి నిల్వ లేకుండా చూడాలని, క్రమం తప్పకుండా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లు శుభ్రపరచాలన్నారు. రెగ్యులర్‌గా క్లోరినేషన్ చేయాలని,రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇల్లు త్వరగా పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ,ప్రతిభారాణి,యం.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

# ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

## ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక్ విజయ్‌కుమార్

**జనం పవర్, జన్నారం, ఆగస్టు 14:** కవ్వాల్ పాలగోరి గ్రామంలో పోడు భూములపై ఫారెస్ట్ అధికారుల దాడులు తక్షణమే ఆపాలని, హక్కు పత్రాలు వెంటనే జారీ చేయాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఆదివాసీ హక్కులపోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులు పోడుసాగుదారులపై అక్రమ కేసులు పెట్టి, వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాలగూరి గ్రామ ప్రజలు చేస్తున్న పోరాటం న్యాయంగా ఉందని అన్నారు. అటవీ అధికారులు ఆదివాసీ ప్రజలపై దాడి చేయడాన్ని పూర్తుగా వ్యతిరేకిస్తున్నమని అన్నారు. పోడు భూముల పరిష్కారానికి అటవీ హక్కుల చట్టం -2006, పోడు భూముల సమస్యను పరి ష్కరించడానికి కేంద్ర ప్రభు త్వం అటవీ హక్కుల చట్టం 2006ను తీసుకొచ్చింది. దీని ప్రకారం2005 డిసెంబర్ 13వ తేదీకి ముందు పోడు భూములను సాగు చేసుకునే గిరిజనులకు హక్కు పత్రాలు (వ్యవసాయ భూమి పట్టాలు) ఇవ్వాలి. గిరిజనేతరులు అయితే మూడు తరాలు, అంటే కనీసం 75ఏళ్ల పాటు ఆ కుటుం బీకులు భూమిని సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఈ చట్టానికి అనుగుణంగా ఉంటేనే అటవీ భూ ముల్లో సాగుచేసే పోడు భూ ములకు పట్టాలు ఇస్తారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి జైనూర్ మండల అధ్యక్షులు మధురాజ్ మడావి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం తీవ్రం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం శంకర్, అర్క యుగెందర్, ఆత్రం మోతిరాం, నార్నూర్ మండల నాయకులు జాలిం శావ్, పాలగోరి ప్రజలు పాల్గొన్నారు.



## విద్య, వైద్య అభివృద్ధి పనులు
# గడువులోగా పూర్తి చేయాలి



**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 14:** జిల్లాలో విద్య, వైద్య శాఖల కింద జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ఆధ్వర్యంలో జరుగుతున్న పీఎం శ్రీ పాఠశాల అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాలనిర్మాణం, జూనియర్, డిగ్రీ కళాశాలల పనులు, గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ అడ్మిన్ బ్లాక్ (రూ.10 కోట్లు), సుల్తానాబాద్ బాలల సదనం (రూ.1.34 కోట్లు) వంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. శాతవాహన యూనివర్సిటీ అడ్మిన్ బ్లాక్ బేస్మెంట్ దశలో ఉండగా, కొత్త విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని, బాలల సదనం పనులు చివరి దశలో ఉండటంతో అవసరమైన అదనపు నిధులను మంజూరుచేస్తామని చెప్పారు. టిఎస్ ఎండిసి ఆధ్వర్యంలో గోదావరిఖని ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్, రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ.51 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, మంథనిలో రూ.22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన భూముల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ఈఈ అశోక్ కుమార్, టి.ఎస్.ఎం.ఐ.డి.సి ఈఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విభజన గాయాలు మరచిపోలేము

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి




**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** దేశ చరిత్రలో 1947 ఆగస్టు 14 చీకటి రోజని, దేశ విభజన గాయాన్ని ఏప్పటికీ మర్చిపోలేమని, బ్రిటిష్ వలస పాలకుల అర్థరహిత విభజనతో అత్యంత హింసాత్మకంగా, మత ప్రాతిపదికన పాకిస్తాన్ అనే కొత్త దేశం ఏర్పడిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. విభజన వల్ల జరిగిన హింస కారణంగా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, ఎంతో మంది భరతమాత ముద్దుబిడ్డలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆగస్టు 14 విభజన గాయాల స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌక్ నుండి బస్టాండ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి ఏటా ఆగస్టు 14న విభజన గాయాల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తూ వస్తున్నదని తెలిపారు. దశాబ్దాల పాటు బ్రిటిష్ విదేశీ పాలనలో సర్వం కోల్పోయిన జాతి మేల్కొని స్వాతంత్ర్యం సాధించుకోవడం చారిత్రకమేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్‌రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ళ రమేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శులు బత్తుల లక్ష్మి నారాయణ,మాడ వెంకట్ రెడ్డి,జిల్లా కార్యదర్శులు సిహెచ్ నర్సింహరాజు, రాపర్తి ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దూలం కళ్యాణ్,దండు కొమురయ్య ,నాంపల్లి శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే ప్రజాభిమానాన్ని గెలుచుకోగలం

## సీపీ అంబర్ కిషోర్ ఝా

**జనం పవర్, రామగుండం, ఆగస్టు 14:** ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలంటే ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బంది నుంచి పూలమొక్కలతో స్వాగతం స్వీకరించి, సాయుధ పోలీసుల గౌరవ వందనం అందుకున్నారు. అనంతరం రిసెప్షన్ సిబ్బంది పనితీరు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి, పెండింగ్ కేసులు, కోర్టు విచారణలో ఉన్న వ్యవహారాలు, దర్యాప్తులో ఉన్న ఫిర్యాదులను సమీక్షించి పరిష్కారానికి తగిన సూచనలు ఇచ్చారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అను మానితులు, క్రిమినల్ హిస్టరీ కలిగిన వ్యక్తుల కదలికలు, మిస్సింగ్ కేసులు, ఇతర నేరాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందించడం, బాధితులతో మర్యాదపూర్వ కంగా వ్యవహరించడం ప్రతి పోలీస్ బాధ్యత అని హితవు పలికారు. సిబ్బంది పనితీరును అభినందించిన సీపీ, డీసీపీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటగా, ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీరమేష్, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్సైలు భూమేష్, రమేష్ పాల్గొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల, ఆగస్టు 14:**ధర్మపురిలోని గోదావరి నది ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఎస్పి అశోక్ కుమార్ గోదావరి పరివాహక ప్రాంతాన్ని సందర్శించారూ. ఈ సందర్భంగా నది వద్ద ప్రస్తుత నీటి మట్టం, ప్రవాహ వేగం, బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. భారీ వర్షాల వల్ల ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుండి నీటి ప్రవాహం కొనసాగుతున్ననందున, నీరు ఉదృతంగా ప్రవహిస్తోంది. గోదావరి నది ప్రవాహాన్ని చూడడానికి, నదిలో దిగడం గాని నది వద్ద సెల్ఫీలు, ఫోటోలు తీసుకోవడం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది అని, గోదావరి వద్దకు వెళ్ళకూడదని ప్రజలకు సూచించారు. ప్రజలు నీటి ఉధృతిని అంచనా వేయకుండా స్నానాలు చేయడానికి నది లోపలికి వెళ్లే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయ ల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆలయ అధికారులు సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండాలని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ధర్మపురి సి.ఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐ ఉదయ్ కుమార్, ఆలయ చైర్మన్ రవీందర్, ఈవో శ్రీనివాస్, ఎంఆర్ఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉన్నారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు

**జనం పవర్, చెన్నూరు, ఆగస్టు 14:**మండల కేంద్రంలో యూరియా కోసం చెప్పులు క్యూలైన్ల పెట్టి పడిగాపులు కాస్తున్న రైతులు. వారం రోజులైనా ఒక్క బస్తా కూడా ఇవ్వలేదని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన చెందుతున్నారు. యూరియా అంతా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో యూరియా కొరత ఉండడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజల్లో దేశభక్తిని పెంచడమే ఈ పుస్తక ధ్యేయం

## తహసీల్దార్ సతీష్‌కుమార్

**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 14:** మందమర్రిపట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో సతీష్‌కుమార్ చేతుల మీదుగా దేశభక్తికి సంబంధించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం, ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను, జీవితాలను త్యాగం చేశారని, ప్రతి ఒక్కరు అటువంటి మహనీయుల త్యాగాలను అనునిత్యం స్మరించుకోవాలని తెలిపారు. పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుతం సింగరేణి ఏరియా ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పహాల్వన్ స్వయంగా రచించిన రెండు పుస్తకాలను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సతీష్ కుమార్‌కు బహుకరించారు. రాజేష్ పహాల్వాన్ 19 సంవత్సరాలు ఆర్మీ జవాన్‌గా దేశానికి సేవలందించి,కార్గిల్ పోరులో దేశానికి తన సేవలు అందించారు. అదే విధంగా 16 సంవత్సరాలుగా సింగరేణి ఏరియాలోని ఎస్ అండ్ పిసి విభాగంలో విధులు నిర్వహిస్తూనే ప్రజల్లో దేశంపై అభిమానం కలిగేలా రచనలు చేయ డంతో పాటు స్వయంగా దేశస్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారి జీవిత చరిత్రలు, వీరు ల త్యాగాలు అందరికి తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనలోని దేశభక్తిని అక్షర రూపంగా మారుస్తూ, దేశభక్తి ఉట్టిపడేలా ఐదు పుస్తకాలు రచించాడు. తాను రచించిన ఐదు పుస్తకాల నుండి,రెండు పుస్తకాలు “బూంద్ బూంద్ ఖూన్ దే గయే, “"భారత్ మాతా కీ గోద్ మే “అను పుస్తకాలు తహశీల్దార్ సతీష్ కుమార్‌కు బహుకరిం చారు. ఈకార్యక్రమంలో రాజేష్ పహాల్వన్ సతీమణి రాణి పహాల్వన్ పాల్గొన్నారు.




# తార్ రోడ్లపై ఇనుప చక్రాల ట్రాక్టర్లు

## పట్టించుకోని రోడ్డు రవాణా అధికారులు

**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 14:** మందమర్రి మండలంలో పలు గ్రామ పంచాయతీ పరిధిలో పొలాలను దున్నడానికి ఉపయోగించే ఇనుపచక్రాల ట్రాక్టర్లు, (కేజింగ్ వాహనాలు) నిత్యం తారురోడ్లపై తిరుగుతూ పల్లె రోడ్లను పాడు చేస్తున్నాయి. ప్రజా సంక్షేమం కోసం వేసిన తారు రోడ్లపై భారీ వాహనాలు, కేజింగ్ ట్రాక్టర్లను విచ్చలవిడిగా రోడ్లపై తిప్పుతూ గ్రామ ప్రజల ప్రయాణానికి అనువుగా ఉన్న రోడ్లను, పగుళ్ల రోడ్లుగా మారుస్తున్నారు. అసలే ఈ రోడ్ల అధ్వాన పరిస్థితి గురించి పట్టించుకునే నాధుడే లేడు అని ఒకవైపు పల్లె ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్లపై గత కొంతకాలంగా నరకయాతన పడుతూ ప్రయాణం చేయలేక ప్రయాణికులు అరిగోస పడుతుంటే ,ఉన్న రోడ్లను ఇలా పాడు చేయడం సబబేనా..?దీన్ని ప్రభుత్వ అధికారులు నివారించే అవసరము ఎంతైనా ఉందంటున్నారు గ్రామాల ప్రజలు, ఈ కేజింగ్ ట్రాక్టర్ల యజమానులకు తగు సూచనలు ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు రవాణా అధికారుల సూచనలు అతిక్రమించిన వాహన యజమానులకు తగు శిక్షలు ,జరిమానాలు విధిస్తామని ఆదేశాలు ఇవ్వాలి. ప్రతి గ్రామానికి రోడ్డు రవాణా ఉండాలని, గ్రామాల సంక్షేమం కోసం ప్రభుత్వ ధనాన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి, ప్రజలకు కనీస అవసరమైన రోడ్డు వ్యవస్థ బాగుండాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ రోడ్లను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామాల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



# కవ్వాల్ రాముని చెరువును మరమ్మతులు చేయించాలి

**జనం పవర్, జన్నారం, ఆగస్టు 14:** జన్నారం మండలంలోని కవ్వాల్ రాముని చెరువు మత్తడివాగుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్త పరిచారు. భారీ వర్ష కురవడంతో... మత్తడివాగుకు గండి పడింది. మరమ్మతులు చేయిస్తే ఆ నీరు చెరువులోకి వచ్చి చెరువుకింద ఉన్న పంట పొలాలు కొన్ని వేల ఎకరాలు సమృద్ధిగా పండుతాయన్నారు. సాగునీరు లేక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పచ్చని పంట కండ్లముందే ఎండి పోతుందేమో అని గుండెలు బాదుకుంటున్నారు. పొలాలకు నీళ్లు పారటంలేదు భూగర్భ జలాలు అడుగంటడంతో బావులల్ల నీళ్లు లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. కాలువ పారుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరేది. ఏప్రిల్, మే నెలల్లో కూడా నీటితో నిండి ఉండేవి. కానీ ఈ సంవత్సరం సరైన వర్షాలు లేవు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు చెరువుల్లో చేరిన కాసిన్ని నీళ్లు ఆగస్టు నెలలోనే ఇంకి పోవడంతో అవి వట్టిపోయాయి. దీంతో ఆయకట్టుకు నీరందక రైతులు ఆవేదన చెందుతున్నారు. తాగునీరు లేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. రాముల వారి చెరువు కిందనే 600 ఎకరాలకు సాగునీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వం అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలన్నారు.



# అఫ్మెల్ ప్రపంచంతో పోటీపడాలి

**-సంస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం**
**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** ప్రపంచంతో పోటీ పడే స్థాయికి అఫ్మెల్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆకాంక్షించారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ అఫ్మెల్‌ను సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో తదుపరి మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాలు తయారీ పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు అఫ్మెల్ కన్నా మించి మిషనరీ మానవ వనరులు లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు కార్మికులకు కావాల్సింది ఒక నిబద్ధత ప్రపంచంతో పోటీ పడగలం అన్న ఆలోచన ఉన్న వ్యవస్థను సక్రమంగా వాడుకోవడం ఎలా అన్న తపన ఉంటే చాలని మనం కూడా ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు. ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీని నియమిస్తామని వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. అధికారులు సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు సాధిస్తామని స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రాల ప్రగతికి దోహదపడవచ్చు అని తెలిపారు. సంస్థను ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని యంత్రాలకు ఓవరాలింగ్ రంగులు వేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని ఆదేశించారు. కార్మికుల శ్రమ ఉన్నత ఆలోచనలతోనే ఈ పరిశ్రమ ముందుకు పోతుందని తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్‌కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బీహెచ్ఈఎల్ అఫ్మెల్ పనిచేస్తుందని థర్మల్ పవర్ స్టేషన్స్ కు అవసరమైన యంత్రాలు యంత్రాల మరమ్మత్తు చేస్తుందని ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో అఫ్మెల్ అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా




**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించే వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ రెక్కల కష్టంతో వంటకి కావల్సిన నిత్యావసర సరుకులు కోసం పెట్టుబడి పెట్టి విద్యార్థుల కడుపు నింపుతున్న కార్మికులకు ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి బిల్స్ ఇవ్వకుండా జాప్యం చేయడం దారుణం అన్నారు. నెలల తరబడి అప్పుల భారంతో తీవ్రంగా వత్తి డికి గురి అవుతున్నారన్నారు. మార్కెట్ లో కోడిగుడ్డు ధర 7 రూపాయలు ఉంటే ప్రభుత్వం 5 రూపాయలు ఇస్తే మిగతా నష్టం ఎవరూ బారాయించాలని అన్నారు. ప్రభుత్వం తక్షణమే మెనూ ధరలు సవరణ చేసి ప్రతి విద్యార్థికి 25 రూపాయలు ఇవ్వాలని కార్మికులు పిఎఫ్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఈఓ నాగలక్ష్మికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తేన్న పల్లి విజయ లక్ష్మి, ప్రభావతి, మంగ, పద్మ, బుజమ్మ, క్రాంతి, స్వప్న, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య బ్యాంకులకు ధీటుగా కరీంనగర్ కో ఆపరేటివ్ బ్యాంకు



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 14:** వాణిజ్య బ్యాంకులకు దీటుగా కరీంనగర్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ముందంజలో ఉందని బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు శాఖ 100 కోట్ల మైలురాయి దాటిందని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలలో బ్యాంకు లావాదేవీలు రెట్టింపు అయ్యాయని తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా అన్ని రకాల లోన్లు తమ శాఖలో వినియోగదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంకు విజయానికి సహకరించిన సిబ్బందికి, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 14:** మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు కోరుకొప్పుల సంపత్ గౌడ్ 25వేల విలువగల క్రీడా దుస్తులు, సుజు విద్యార్థులకు పంపిణీ చేశారు. గురువారం మాజీ ఎంపీటీసీ ఎలుకలత దేవయ్య 11 విలువగల షూస్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చేయూతనందించడం వల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉండ్రాళ్ల తిరుపతి హర్షం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా దాతలను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంజుమ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఎలుకంటి శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, రాజు, సంతోష్, పరశురాములు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బేబి కేర్ సెంటర్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**జనం పవర్. సిద్దిపేట, ఆగస్టు 14:** సిద్దిపేటలోని మాతృ మందిరం బేబీ కేర్ సెంటర్‌లో శ్రీకృష్ణ అష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ పలువురిని ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ గీతా తదితరులు పాల్గొన్నారు

# స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** కొత్తగూడెం ప్రగతి మైదానంలో శుక్రవారం జరగబోయే 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పరిశీలించారు. జాతీయ పతాక ఆవిష్కరణ నుండి కార్యక్రమం ముగిసే వరకు జరిగే అన్ని ఏర్పాట్లను సమగ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్చ్ పాస్ట్, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం శకటాల ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే ఛాయా చిత్ర ప్రదర్శనలు అధికారులకు విఐపీలకు గ్యాలరీలు మంచినీటి వసతి వాహన పార్కింగ్ వంటి సదుపాయాలు పకడ్బందీగా ఉండాలని, వర్షం వచ్చినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిలీల రెసిడెన్సీకి రూ.10 వేల జరిమానా



**జనం పవర్, రామగుండం ఆగస్టు 14:** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని సాయిలీల రెసిడెన్సీ, హైకింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో నాణ్యత లేని ఆహార పదార్థాలు వడ్డిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో, గురువారం సంస్థ అధికారులు దాడులు నిర్వహించి పదివేల రూపాయల జరిమానా విధించారు. తనకు వడ్డించిన ఆహారం నాణ్యతలేదని ఒక వినియోగదారుడు సాయంత్రం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీకి ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆమె వెంటనే ప్రజారోగ్య విభాగం అధికారులకు తనిఖీలు జరపాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, సంపత్,



ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు నిర్వహించిన తనిఖీల్లో నాణ్యతలేని ఆహార పదార్థాలు గుర్తించడంతో రెస్టారెంట్‌పై జరిమానా విధించబడింది.

## మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** దేశ స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ 12వ వార్డులోని సుభాష్ చంద్రబోస్ నగర్ లోని ఉన్న మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే జెండా ఆవిష్కరణ మాత్రమే కాదని బానిస సంకెళ్ళు తెంచడానికి మన పూర్వీకులు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు దేశ సార్వభౌమత్వం సమగ్రత కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి కట్టుగా జీవిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని చేసిన ప్రసంగాలు సామున్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సారేజహ్నాసే అచ్ఛా హిందుస్తాన్ హమార అంటూ చిన్న పిల్లలు చేసిన నృత్య ప్రదర్శన అలరించాయి.

ఈ కార్యక్రమంలో ప్రధానా అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు లక్ష్మీ ప్రసన్న, శిరిషా, నీలా, నసురత్, సల్మా, సరస్వతి, విజయలక్ష్మి, నాజీయా, సుహాన, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి ఏటీడీఓ అక్రమాలపై విచారణ చేయాలి

**గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి**

**జనం పవర్, భీమారం, ఆగస్టు 14:** విద్యార్థినులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ఇంచార్జీ ఏటీడీఓ అవినీతి అక్రమాల పై పూర్తి విచారణ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమారం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యూఓ మంచిర్యాల ఇంచార్జీ ఏటీడీఓ ఆకుల పురుషోత్తం పెద్దపల్లి జిల్లా నుంచి చుట్టపు చూపు లాగా విధులకు హాజరు అవుతున్నారని ఆరోపించారు. విద్యార్థినులకు మెనూ పాటించడం లేదన్నారు. విద్యార్థినుల పట్ల ఉద్యోగులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వర్షంలో ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ఆందోళన చేసే విద్యార్థుల దగ్గరికి వెళ్లి పక్కకు ఎస్సై ఇతర అధికారులు ఉన్న ఆడపిలాలాతో గొడుగు పట్టించుకున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాల, హాస్టల్ నుంచి ప్రతి నెల మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇతినిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం, నేతకాని మహర్ కుల సంఘం, వంచిత్ బహుజన్ ఆఘాడి (విబిఏ) పార్టీ. రిప బ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, బీమ్ రావు అంబేద్కర పార్టీ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి విజ్ఞప్తి చేస్తుం దన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ దాన్‌కు 'సదాశయ' జీవనాడి

- శరీర, అవయవ, నేత్ర దానాలలో 17 ఏళ్ల విశేష కృషి
- 60 వేల మందిచే శరీర, అవయవ నేత్ర దానాలకు అంగీకారం
- అనేక అవార్డులు, రివార్డులు, అందుకున్న సదాశయ







**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 14:** అవయవ దానాలలో "జీవన్ దాన్" దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. జీవన్ దాన్ ఈ విశిష్టతను సాధించడం వెనుక గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని 8వ ఇంక్లైన్ కాలనీలో 17 ఏళ్ల క్రితం ఏర్పడిన సదాశయ ఫౌండేషన్ కొన సాగించిన నిరంతర కృషి ఎంతగానో దోహద పడింది. 2008 అక్టోబర్ 2న కాళోజి స్ఫూర్తితో పారిశ్రామిక కేంద్రంలో శరీర, అవయవ, నేత్రదాతల సంఘం 'సదాశయ' పురుడు పోసుకుంది. హైదరాబాద్ కిమ్స్ లో 2012లో ప్రభుత్వం జీవన్ దాన్ ఏర్పాటు చేయడానికి ఒక విధంగా సదాశయ ఫౌండేషన్ ప్రేరణగా నిలిచింది. అంతకు నాలుగేళ్ల క్రితం నుండే సదాశయ ఫౌండేషన్ శరీర, అవయవ, నేత్రదానాలపై విశేషమైన కృషి సలుపుతూ వచ్చింది. వైద్య విద్యలో విద్యార్థులకు అవసరమైన శరీరాల కొరతను తీర్చేందుకు, అనేకమంది అంధులకు చూపును ప్రసాదించేందుకు, అవయవ దానాలతో అంపశయ్యపై ఉన్న వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషి సమాజానికి మార్గదర్శకంగా నిలిచింది.

**వారిద్దరి స్ఫూర్తితో..**

మరణానంతరం తన శరీరాన్ని వైద్య కళాశాలకు దానం చేసిన కాళోజి స్ఫూర్తితో తన సోదరుడు టి అశోక్ కుమార్ మర ణానంతరం దేహాన్ని వైద్య కళాశాలకు దానం చేయడంతో, సమాజంలో శరీర, అవయవ, నేత్రదానానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించిన సింగరేణి ఉద్యోగి టి శ్రవణ్ కుమార్ సదాశయ ఫౌండేషన్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు.

**17 ఏళ్ల ప్రస్థానంలో..**

సదాశయ ఫౌండేషన్ తన 17 ఏళ్ల ప్రస్థానంలో శరీర, అవయవ, నేత్రదానాలపై రాష్ట్రంలోని నలుమూలల 1600 చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసింది. ఫలితంగా శరీర, అవయవ, నేత్రదానం చేసేందుకు 60 వేల మంది ముందుకు వచ్చి ఫౌండేషన్ ప్రతినిధులకు అంగీకార పత్రాలు అందజేశారు.

**3000 మందికి చూపు..**

సదాశయ ఫౌండేషన్ నిరంతర కృషితో మరణానంతరం 1521 మంది తమ నేత్రాలను దానం చేసి మరో మూడు వేల మందికి చూపును ప్రసాదించారు. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఇతర ఆసుపత్రుల సౌజన్యంతో నేత్రాలను సేకరించిన ఫౌండేషన్ ప్రతినిధులు అంధులైన పలువురికి ప్రపం చాన్ని చూపగలిగారు. ఫౌండేషన్ చేసిన కృషితో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓదెల, అబిడిపల్లి గ్రామాల ప్రజలు నూటికి నూరు శాతం నూటికి నూరు శాతం నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చి రికార్డ్ సృష్టించారు.

**శరీర, అవయవ దానాలు..**

సదాశయ ఫౌండేషన్ ప్రోత్సాహంతో ఇప్పటివరకు 90 మంది అవయవ దానం చేయగా, మరో 151 మంది శరీర దానం చేశారు.

**పురస్కారాలు..**

శరీర, అవయవ, నేత్రదానాలపై విశేషంగా సేవలు అందిస్తున్న సదాశయ ఫౌండేషన్ అనేక పురస్కారాలు అందుకుంది.

ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ రెండుసార్లు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ జీవన్ దాన్ తో పాటు లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సంస్థల చేతుల మీదుగా పురస్కారాలు స్వీకరించారు.

రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సామాజిక సేవా సంస్థ పురస్కారాన్ని పొందారు. వాసన్ ఐ బ్యాంక్, ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల చేత సత్కారం పొందారు. శరీర దానాల విషయాలలో చేసిన కృషికి గాను పలు వైద్య కళాశాలల నుండి ఫౌండేషన్ ప్రతిని ధులు సత్కారం పొందారు. 2009లో హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా శ్రవణ్ కుమార్ సత్కారం పొందారు. 2017లో మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాటి సిబిఐ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సత్కారాన్ని అందుకున్నారు.

2022లో న్యూఢిల్లీలో జరిగిన శరీర,అవయవ, నేత్రదాతల సదస్సుకు ఆహ్వానం అందుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు, అక్కడ నిర్వాహకులచే ప్రశంసలు పొందారు. 2023లో రాజస్థాన్ లో జరిగిన జాతీయ శరీర, అవయవ, నేత్రదాతల సదస్సుకు ఫౌండేషన్ ప్రతినిధి భీష్మాచారి ఆహ్వానం అందుకొని నిర్వాహకులచే ప్రశంసలు, అవార్డు పొందారు. అదే సంవత్సరం ఫౌండేషన్ మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ వరంగల్ లో మహిళా శక్తి పురస్కారం అందుకున్నారు.

ప్రస్తుత సంవత్సరం హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య చేతుల మీదుగా శ్రవణ్ కుమార్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా భీష్మాచారి అవార్డులు అందుకున్నారు.

**శరీర, అవయవ దాతలకు ప్రోత్సాహం కల్పించాలి..**

ప్రభుత్వాలు శరీర, అవయవ, నేత్రదాతలకు,వారిని ప్రోత్సహిస్తున్న సంస్థలకు
తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి శ్రవణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. మరణానంతరం శరీర, అవయవ, నేత్రాలు అందరికీ ఉపయోగపడే విధంగా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, శ్రీలంక మాదిరిగా చట్టసభల్లో శాసన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవయవదానం చేస్తున్న వారికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు ఏర్పాటు చేయడం, పదివేల నగదు అందించడం, సంబంధిత కుటుంబానికి జిల్లా కలెక్టర్, సమాన స్థాయి అధికారి చే ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతున్నదని గుర్తు చేస్తూ, అలాంటి విధానాలు తెలంగాణలోనూ అమలు కావలసిన అవసరం ఉందన్నారు.

## లక్ష్యంతో చదివితే విజయం వరిస్తుంది

**ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే..**




**పెద్దపల్లి, ఆగస్టు 14:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జే ఎన్టీయూ కొండగట్టు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సతీష్,దాసరి మనోహర్ రెడ్డి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు,ఎస్సార్ యూనివర్సిటీ రీసెర్చ్అండ్ డీల్ ప్రొఫెసర్ డాక్టర్ సమ్మయ్య, మోటవేషనల్ స్పీకర్ శ్రీనివాస్ హాజరై విద్యార్థులను వారి భవిష్యత్తు గురించి వివరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ..విద్యార్థులు ఇంజనీరింగ్ వైపు అడగేయడం శుభసూచికమని ట్రినిటీ ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలను ఎంచుకోవడం ఒక తెలివైన నిర్ణయమని కళాశాల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడం కొరకు ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ గత 40 సంవత్సరాలుగా మారుమూల ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు సేవలందిస్తూ ఎందరో మంది విద్యార్థుల జీవితాలను స్థిర పడే విధంగా చేస్తుందని ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం జాయిన్ అయిన విద్యార్థులు మొదటి రోజు నుండే ఒక లక్ష్యం ఏర్పరచుకొని ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను నేర్చుకుంటూ క్రమశిక్షణతో చదివి ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా ముందుకు వెళ్లాలని ఇప్పుడున్న తరుణంలో ఉద్యోగ అవకాశాలు పొందడం అనేది బ్రాంచీలతో సంబంధం లేకుండా పొందవచ్చని తల్లిదండ్రులు విద్యార్థుల యొక్క చదువు పట్ల ఎప్పటి కప్పుడు గమనిస్తూ విద్యార్థులను సక్రమమైన మార్గంలో ఉంచేట్టు తల్లిదండ్రులు కృషి చేయాలని తమ యొక్క కళాశాల లో 15 సంవత్సరాల పైగా అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యార్థులకు బోధన అందిస్తూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా కార్యక్రమాల రూపొందిస్తూ ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించే విధంగా సెమినార్స్,ఇండస్ట్రియల్ విజిట్స్, క్యాంపస్ ప్లేస్మెంట్స్ ఇలాంటివి విద్యార్థులు అందిస్తామని అన్నారు.తమ యొక్క కళాశాల పై నమ్మకం ఉంచి ఈ యొక్క కళాశాలలో సీట్ పొందున విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్,ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్ మాట్లాడుతూ తమ యొక్క కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి,చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో వారి మార్గదర్శకంలో ప్రతిష్టాత్మకమైన ఎన్.ఏ.ఏ.సి అక్రిడేషన్,అటానమస్ పొందడం జరిగిందని,రానున్న కాలంలో యూనివర్సిటీ దిశగా ముందుకు వెళ్తున్నామని అంతేకాకుండా జిల్లాలో 100% అడ్మిషన్స్ పొందిన ఏకైక కళాశాల రానున్న కారణంగా విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించే విధంగాకార్యక్రమాల రూపొందించి విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సతీష్,శ్రీనివాస్, ప్రొఫెసర్ డాక్టర్ సమ్మయ్య, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్,ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్,ఏవో సురేష్, చొప్పరి వంశీ, విభాగాధిపతులు పద్మిని, స్వాతి,లక్ష్మి,ప్రభాకర్, డాక్టర్ ఆరిఫ్,సీనియర్ ఆధ్యాపకులు వెంకట స్వామి, మహేందర్, రామ్మూర్తి,కొప్పుల శ్రీనివాస్, కిషన్,రవీందర్ పాల్గొన్నారు.

## మల్లాపూర్ జీపీ నూతన కార్యాలయానికి నిధులు మంజూరు



**మద్నూర్ :** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోనిమల్లాపూర్ గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నూతన భవన నిర్మాణానిక గురువారం మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి పాటుపడే నాయకుడు ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతా రావు అని అన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులకైనా ఎమ్మెల్యే పట్టుదలతో పని చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వైస్ చైర్మన్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, అలాగే ఉమాకాంత్ పటేల్, లక్ష్మణ్ పటేల్, దీన్ దయాల్ పటేల్, గైక్వాడ్ విలాస్, కాంగ్రెస్ కార్యకర్తలు శెట్టివారి రాజు, సంతోష్, అమృత్వార్ శ్రీకాంత్, జిపి సెక్రెటరీ ప్రమోద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను సరిచేస్తుండగా విద్యుదాతాంతో జీపీ కార్మికుడి మృతి

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 14:** పంచాయతీ కార్మికుడు జాతీయ జెండాను సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన మోహీన్ పాషా (32) గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడు గా విధులు నిర్వహిస్తున్నా డు..ఈ క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా పైపు(ఇనుప) ను శుద్ధి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. విద్యుతా ఘాతంతో మోహీన్ పాషా



అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్ద విషాదం నింపింది. మృతునికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు..

## ఉపకార వేతనాలు అందేలా చర్యలు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**



**రాజన్న సిరిసిల్ల :**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందేవిదంగా చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నేషనల్ స్కాలర్ షిప్ స్కీమ్ క్రింద వీడియో కార్మికుల పిల్లలకి అందించే ఉపకార వేతనాల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ గురువారం సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ...కేంద్ర కార్మిక శాఖ ద్వారా బీడీ కార్మికులు, లైమ్ స్టోన్ అండ్ డోలో మైట్ ఖనిజాల కార్మికులు, మైకా మైనింగ్ కార్మికులు, ఐరన్ ఓర్ , క్రోమ్ ఓర్ మైనింగ్ కార్మికులు, సినీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సిరిసిల్ల జిల్లా పరిధిలో బీడీ కార్మికుల పిల్లలందరికి ఉపకార వేతనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 6 నెలల పాటు బీడీ కార్మికులుగా పని చేసిన వారు, వార్షిక ఆదాయం 1,20,000 లోపు ఉన్న వారు ఈ పథకానికి అర్హులుగా ఉంటారని అన్నారు.

నేషనల్ స్కాలర్ షిప్ క్రింద 1 నుంచి 4వ తరగతి చదివే పిల్లలకు వెయ్యి రూపాయలు, 5 నుంచి 8వ తరగతి చదివే పిల్లలకు 1500, 9 నుంచి 10వ తరగతి చదివే పిల్లలకు 2 వేల రూపాయలు, ఇంటర్ పిల్లలకు 3 వేల రూపాయలు, డిగ్రీ, పిజి డిప్లమా కోర్సుల చదివే పిల్లలకు 6 వేల రూపాయలు, ఐటిఐ పాలిటెక్నిక్ చదివే పిల్లలకు 8 వేల రూపాయలు, ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు చేసే పిల్లలకు 25 వేల రూపాయల ఉపకార వేతనం అందుతుందని అన్నారు.

1 నుంచి 10వ తరగతీ వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31 లోపు,ఇంటర్ పై చదువు చదివి విద్యార్థులు అక్టోబర్ 31 లోపు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాలోని బీడీ కార్మికుల పిల్లలందరూ ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ దరఖాస్తులు ఆగస్టు 31 లోపు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

అర్హత గల బీడీ కార్మికుల పిల్లలందరు scholarships.gov.in% జాతీయ స్కాలర్షిప్ కోర్ట్ నందు దరఖాస్తుల సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర ఉప సంక్షేమ కమిషనర్ సాగర్, ప్రధాన్ సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, కేంద్ర సంక్షేమ ఆసుపత్రి డాక్టర్ మహేందర్, డాఉ మధుకర్, డాక్టర్ వెంకటేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, అదనాపు డిఆర్ డిఏ శ్రీనివాస్, ఎంపీడీవో లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిది

**మద్నూర్,ఆగస్టు 14:** మద్దూరు మండలంలోని వ్యవసాయ మార్కెట్ అవర్ణలో సీఎం సహాయ నిధి పథకం ప్రజల ఆరోగ్యానికి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మద్నూర్ మండలంలోని ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ పథకం చెక్కులను నాయ కులు గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య నిత్య ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం, ప్రజల ఆరోగ్యానికి వరం లాంటి పథకమని వారు అన్నారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, సలాబత్పూర్ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దరాస్ సాయిలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి, కొండ గంగాధర్, వట్నాల రమేష్, కొండ రాజు, దిగంబర్, థైదల్వార్ రాజు, మాధవరావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ



**తంగళ్ళపల్లి, ఆగస్టు 14:** తంగళ్ళపల్లి మండలం అంకుశాపూర్, గండిలచ్చపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ చేసిన నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరసింగం గౌడ్ చేతుల మీదుగా రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. నెలల నరసింగం గౌడ్ మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది దీని ద్వారా అందరికీ నాణ్యమైన సన్నబియ్యం అందించడం జరుగుతుంది .ప్రభుత్వ మాట ఇచ్చిన ప్రకారం ప్రతి సంక్షేమాన్ని అమలు చేసి తీరుతుందని తెలియజేస్తూ ప్రభుత్వ పెద్దలందరికీ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు అంజయ్య ప్రధాన కార్య దర్శి కంకణాల లక్ష్మణ్ రాజేశం భైరి శ్రీని వాస్‌రెడ్డి బాలసాని జీల శేఖర్ భానుచందర్ అంచ సాయి రెడ్డి కదుదూరి బాల్రెడ్డి ఎల్లారెడ్డి రాంప్రసాద్ సంజీవ్‌రెడ్డి కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఆలోచన నుంచి బయటకు రండి.. మృణాల్‌కు బిపాసా బసు కౌంటర్!

కొన్ని రోజులుగా 'సీతారామం' భామ మృణాల్ ఠాకూర్ వరుసగా వార్తల్లో నిలుస్తున్నారు. మొన్నటి వరకు డేటింగ్ రూమర్స్‌తో హాట్ టాపిక్‌గా మారిన మృణాల్.. ఇప్పుడు బిపాసా బసుపై కామెంట్స్ చేసిన పాత వీడియోతో మరోసారి వార్తల్లో నిలిచారు. ఈ నేపథ్యంలో బిపాసా పరోక్షంగా ఆమెకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బిపాసా తాజాగా మహిళలను ఉద్దేశిస్తూ ఓ కొటేషన్ పెట్టారు. ''బలమైన మహిళలు ఎప్పుడూ ఒకరి ఉన్నతి కోసం మరొకరు కృషి చేస్తారు. మహిళలంతా ఎంతో బలంగా, దృఢంగా ఉండాలి. అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. అమ్మాయిలు బలంగా కనిపించకూడదు అనే పాతకాలపు ఆలోచనల నుంచి బయటకు రండి'' అని పేర్కొన్నారు. దీనికి 'మిమ్మల్ని మీరు ఎప్పుడూ ప్రేమించుకోండి' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆమె మృణాల్‌ను ఉద్దేశించే ఈ పోస్ట్ పెట్టినట్లు నెటిజన్లు భావిస్తున్నారు. అసలేం జరిగిందంటే.. ఒక వీడియోలో మృణాల్ మాట్లాడుతూ.. తాను బిపాసా కంటే చాలా అందంగా ఉంటానని చెప్పారు. ఆమె కండలు తిరిగిన పురుషుడిలా కనిపిస్తారని అన్నారు. ఆమెతో పోలిస్తే తాను ఎంతో అందంగా ఉంటానని కామెంట్ చేశారు. అది ఇప్పుడు వైరల్ అవుతోంది. బాలీవుడ్ సెలబ్రిటీలు పలువురు మృణాల్ మాటలను తప్పుపడుతున్నారు. కొన్ని రోజులుగా మృణాల్-ధనుష్ రిలేషన్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలకు మృణాల్ ఇటీవలే చెక్ పెట్టారు. ధనుష్ తనకు స్నేహితుడని చెప్పారు. అజయ్ దేవగణ్ పిలిస్తేనే ధనుష్ 'సన్ ఆఫ్ సర్దార్ 2' ఈవెంట్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ వార్తలు తనకెంతో ఫన్నీగా అనిపించాయని అన్నారు. అంతటితో ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది.






# అలా అడిగితే పొగరంటారు: అనుపమ పరమేశ్వరన్

'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు చెప్పారు. ''ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీమ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను'' 'ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారు'' అని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.

## స్పోర్ట్స్



# రెండో స్థానానికి రోహిత్

*** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్**

ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ రెండో స్థానానికి ఎగబాకాడు. 38 ఏళ్ల రోహిత్ 2025 ఐపీఎల్ సీజన్ తర్వాత మళ్లీ క్రికెట్ ఆడలేదు. రెండో స్థానంలోని బాబర్ అజామ్ వరుస వైఫల్యాలతో మూడో స్థానానికి పడటంతో.. రోహిత్ రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. శుభ్‌మన్ గిల్ నంబర్‌వన్ వన్డే బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి నాలుగో ర్యాంకులో ఉన్నాడు. శ్రేయస్ 8, రాహుల్ 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో కుల్‌దీప్ యాదవ్ రెండో స్థానంలో నిలిచాడు. జడేజా 9వ స్థానంలో ఉన్నాడు. తీక్షణ (శ్రీలంక) నంబర్‌వన్ వన్డే బౌలర్‌గా కొనసాగుతున్నాడు. టీ20 బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్‌కు ఆరో ర్యాంకు దక్కింది. జైస్వాల్ 11వ స్థానంలో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి రవి బిష్ణోయ్ (7వ), అర్ష్‌దీప్ సింగ్ (9వ) టాప్-10లో ఉన్నారు. డఫి (న్యూజిలాండ్) నంబర్‌వన్ టీ20 బౌలర్.

# ఆగస్ట్ 14.. క్రికెట్ గాడ్ 'సెంచరీ' శతకాల రికార్డుకు నాంది




90's కిడ్స్‌కు అతడి పేరు ఓ ఎమోషన్. క్రీజ్‌లో ఉన్నాడంటే హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకొనేవారు. అదే ఔటయ్యాడని తెలిసిందా.. నిట్టూర్చేవారు. అంతా అయిపోయిందని టీవీ, రేడియోను కట్టేసేవాళ్లు. ఆ బ్యాటరే మాస్టర్ బ్లాస్టర్, క్రికెట్ గాడ్ సచిన్ తెందూల్కర్. ఆగస్ట్ 14 అతడి జీవితంలో గుర్తుండిపోయే రోజు. సరిగ్గా 35 ఏళ్ల కిందట '100' శతకాల రికార్డుకు ఆ రోజే పునాది పడింది. అంతర్జాతీయ క్రికెట్‌లోకి 16 ఏళ్ల వయసులో అడుగు పెట్టిన సచిన్ తెందూల్కర్ మొదటి సెంచరీ కోసం దాదాపు సంవత్సరం వేచి చూశాడు. 1990లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో 119 పరుగులు సాధించాడు. మాంచెస్టర్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో శతకం చేయడం సాధారణ విషయం కాదు. టీనేజర్‌గా సచిన్ బాదిన ఆ సెంచరీ 'రికార్డు'లకు అంకురార్పణ అని ఎవరూ అంచనా వేయలేదు. దాదాపు రెండు దశాబ్దాలపాటు క్రికెట్ సామ్రాజ్యాన్ని ఏలిన సచిన్ చరిత్ర ఏంటో అందరికీ తెలిసిందే. కానీ, అతడు సాధించిన తొలి సెంచరీ మాత్రం ఎప్పటికీ నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే ఆ పరుగులు చేసే క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు.

**క్లిష్ట పరిస్థితుల్లో వచ్చి..**

సాధారణంగా సగం వికెట్లు పడ్డాయంటే టీమ్‌ఇండియా పని అయిపోయినట్లేనని ప్రత్యర్థి జట్లు భావించేవి. కానీ, అవన్నీ తప్పని నిరూపించిన మ్యాచ్ అది. ఎందుకంటే లోయర్‌తో కలిసి సచిన్ జట్టును ఓటమి నుంచి బయటపడేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 519 పరుగులు చేసింది. గ్రాహం గూచ్, మైక్ అథర్టన్, రాబిన్ స్మిత్ సెంచరీలు బాదారు. భారత్ అందుకు దీటుగానే స్పందించింది. హైదరాబాదీ బ్యాటర్ మహ్మద్ అజారుద్దీన్ (179), సంజయ్ మంజ్రేకర్ (93), సచిన్ (68) ఆదుకొన్నారు. దీంతో 432 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 87 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లాండ్ 320/4 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. అలెన్ లాంబ్ (109), మైక్ అథర్టన్ (74), రాబిన్ స్మిత్ (61) రాణించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. 408 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నవ్‌జ్యోత్ సిద్ధూ (0) డకౌట్ కాగా.. కాసేపటికే రవిశాస్త్రి (12) పెవిలియన్‌కు చేరాడు. అనంతరం సంజయ్ మంజ్రేకర్ (50), దిలీప్ వెంగసర్కార్ (32) కాస్త ఆదుకొనే ప్రయత్నం చేశారు. స్వల్ప వ్యవధిలో వారిద్దరితోపాటు అజారుద్దీన్ (11) ఔట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. అప్పుడు బ్యాటింగ్‌కు వచ్చిన సచిన్ (119నాటౌట్: 189 బంతుల్లో) చివరి వరకు క్రీజ్‌లో నిలిచాడు. మాల్కోమ్, హెమ్మింగ్స్ వంటి డేంజరస్ బౌలర్లను ఎదుర్కొన్నాడు. అతడికి కపిల్ దేవ్ (26), మనోజ్ ప్రభాకర్ (67*) సహకారం అందించారు. చివరికి 6 వికెట్ల నష్టానికి 343 పరుగులు చేయడం గమనార్హం. ఇక ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి.

**ఈ రికార్డు కష్టమే..**

ఇంగ్లాండ్‌పై టెస్టులో సెంచరీ బాదిన సచిన్.. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 24 ఏళ్ల కెరీర్‌లో 664 మ్యాచులు ఆడి 34,357 పరుగులు చేశాడు. ఇందులో వంద శతకాలు, 164 అర్ధశతకాలు ఉన్నాయి. ఇప్పట్లో '100' సెంచరీల రికార్డును అధిగమించడం చాలా కష్టమే. విరాట్ కోహ్లీ (82) కేవలం వన్డేల్లోనే ఆడుతున్నాడు. కెరీర్‌లో 200 టెస్టుల్లో 15,921 పరుగులు, 463 వన్డేల్లో 18,426 పరుగులు, ఒకే ఒక్క అంతర్జాతీయ టీ20లో 10 పరుగులు చేశాడు. వంద శతకాల్లో.. టెస్టుల్లో 51, వన్డేల్లో 49 బాదాడు. టెస్టుల్లో అత్యధిక పరుగుల రికార్డు ఏమైనా చేజారొచ్చేమో కానీ.. మిగతావన్నీ పదిలంగా ఉండటం ఖాయమే. సచిన్ 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.